హైదరాబాద్
గురువారం-19
నవంబర్-2026

పేజీలు-8

balagamtv100@gmail.com

బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/

ఫీజు బకాయిలు వెంటనేచెల్లించాలి


వివరాలు 2లో..

వాహ్.. వాయేజర్..! 49 ఏండ్ల ప్రయాణం..



- అంతరిక్షంలో సరికొత్త రికార్డు
- భూమికి ఒక కాంతి రోజు దూరానికి చేరిన వాయేజర్-1
- 49 ఏండ్ల ప్రయాణం.. అంతరిక్షంలో రికార్డు

వాషింగ్టన్ : అంతరిక్ష పరిశోధనలో మరో చారిత్రక ఘట్టం నమోదైంది. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' ప్రయోగించిన వాయేజర్-1 వ్యోమనౌక భూమి నుంచి ఒక కాంతి రోజు దూరాన్ని చేరుకుంది. 1977 సెప్టెంబర్ 5న ప్రయాణం ప్రారంభించిన ఈ వ్యోమనౌక 2026, నవంబర్ 18 నాటికి సుమారు 25.9 బిలియన్ కిలోమీటర్లు ప్రయాణించింది. కాంతి ఒక రోజులో ప్రయాణించే దూరాన్ని 'కాంతి రోజు' అంటారు. కాంతి వేగం సెకనుకు సుమారు 3 లక్షల కిలోమీటర్లు. ఈ లెక్కన 24 గంటల్లో 25.9 బిలియన్ కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. వాయేజర్-1 గంటకు సుమారు మిగతా 3లో..

ఆంధ్రా బాబు కుట్రలో
బీజేపీకి భాగస్వామ్యం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పాలమూరు, నల్లగొండను ముంచిందే కాంగ్రెస్
- నేడు మళ్లీ అదే ద్రోహం చేస్తున్న రేవంత్ సర్కార్
- ఉమ్మడి రాష్ట్రంలో సీఎంలు చేసినదాని కంటే
- తెలంగాణకు రేవంత్ చేస్తున్న ద్రోహమే ఎక్కువ
- ధ్వజమెత్తిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బాబు గండి కొడుతుంటే రేవంత్‌కు సోయిలేదా?



హైదరాబాద్, నవంబర్ 18 :
నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఏపీ గండికొడుతూ డెడ్ స్టోరేజీ నుంచి కూడా జలాలను తరలించేందుకు ప్రాజెక్టు కడుతుంటే రేవంత్ సర్కార్‌కు సోయిలేకుండా పోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. కనీసం ఆ జిల్లాకు చెందిన, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏం చేస్తున్నట్టని నిలదీశారు. ఏపీ చేపడుతున్న ప్రాజెక్టుతో తెలంగాణకు తీరని అన్యాయమని ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డితో కలిసి బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. నదీ జలాల్లో తెలంగాణకు జరిగిన అన్యాయం గురించి చెప్తే భారతమంత, రాస్తే రామాయణమంత అని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వందల సార్లు సభల్లో చెప్పారని గుర్తుచేశారు.తెలంగాణ నదీ జలాలు, నీటి వనరులను ఆకళింపు చేసుకున్న తర్వాత, విశ్రాంత ఇంజినీరు విద్యా సాగర్ రావు, ప్రొఫెసర్ జయశంకర్‌తో పాటు రిటైర్డ్ ఇంజనీర్లు, ఎంతోమంది నీటి వనరుల నిపుణులతో గంటలుగంటలు చర్చించిన తర్వాత సమైక్య రాష్ట్రంలో తెలంగాణకు ఎన్నటికీ న్యాయం జరుగబోదని, ప్రత్యేక తెలంగాణ రావాల్సిందేనని పట్టుబట్టి తుదకు నీళ్లు, నిధులు, నియామకాలు అనే ట్యాగ్‌లైన్‌తో తెలంగాణ ఉద్యమం చేపట్టారని వివరించారు. తెలంగాణను ఆంధ్రాలో విలీనం చేసి పాలమూరు, మిగతా 3లో..

కేంద్రం అండతో ఏపీ
జలదోపిడీ..



- తెలంగాణ ప్రభుత్వం ఏం చేస్తోంది?:
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కృష్ణా జలాల తరలింపుపై రాష్ట్ర ప్రభుత్వానికి ప్రశ్నలు
- తెలంగాణకు రావాల్సిన 40 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించాలని డిమాండ్
- ఏపీ నీటి తరలింపును అడ్డుకునేందుకు కేఆర్ఎంబీకి లేఖ రాశారా?
- జలదోపిడీని అడ్డుకోకపోతే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరిక

హైదరాబాద్, నవంబర్ 18 :
కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జలదోపిడీకి పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఏపీ ప్రభుత్వం నీటిని ఇష్టానుసారంగా తరలిస్తుంటే తెలంగాణలోని బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు మిగతా 3లో..

26న చేయూత నూతన పెన్షన్లు, ఇందిరమ్మ చీరల పంపిణీ



- 4,63,857 మందికి కొత్తగా చేయూత పెన్షన్లు..
- అదే రోజు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ
- కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీకి శ్రీకారం
- రాజ్యాంగ స్ఫూర్తితో సామాజిక భద్రత..
- ఇందిరమ్మ స్ఫూర్తితో మహిళలకు గౌరవం
- మంత్రి సీతక్క వివరాలు 2లో..

క్రీడారంగంపై సర్కార్ చిన్నచూపు : హరీశ్‌రావు



సీఎం ఫుట్‌బాల్ సోకులకు రూ.100 కోట్లు
గ్రామీణ క్రీడాకారులకు చేసింది సున్నా
మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్

హైదరాబాద్, నవంబర్ 18 :
క్రీడారంగాన్ని కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు చూస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. క్రీడలపై సీఎం రేవంత్‌రెడ్డి మాటలు అంతర్జాతీయస్థాయి దాటుతుంటే, చేతలు మాత్రం గల్లీస్థాయి దాటడంలేదని దెప్పిపొడిచారు. బుధవారం హరీశ్‌రావును హైదరాబాద్‌లోని నివాసంలో ఉస్మానియా యూనివర్సిటీ స్పోర్ట్స్ స్టూడెంట్ ఫెడరేషన్ బృందం కలిసి, వినతిపత్రం అందించి సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహిస్తామంటూ దబ్బాకొట్టుకొనే రేవంత్‌రెడ్డి.. క్రీడాకారుల సమస్యలు కనిపించడంలేదా? అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల పేరిట అన్ని వర్గాలను మోసం చేసినట్లే.. క్రీడాకారులను కూడా దగా చేశారని ధ్వజమెత్తారు. 'ఫుట్‌బాల్ సరదా తీర్చుకొనేందుకు రూ.100 కోట్ల ప్రజా ధనాన్ని వృథా చేసిన సీఎం, క్రీడాకారులకు చేసింది గుండుసున్నా' అని మండిపడ్డారు.రాష్ట్ర మిగతా 3లో..

ఏసీబీకి చిక్కిన పబ్లిక్ ప్రాసిక్యూటర్



- రూ.1.50 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు ..
- పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఘటన

పెద్దపల్లి కమాన్, నవంబర్ 18: ఆర్థిక స్థోమతలేని కక్షిదారుల తరపున ఉచితంగా కేసులను వాదించాల్సిన ఓ పబ్లిక్ ప్రాసిక్యూటర్, హత్య కేసులో నిందితుడి వద్ద లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. బుధవారం పెద్దపల్లి పట్టణంలో జరిగిన ఘటన రాష్ట్రంలో సంచలనం రేపింది. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారం గ్రామానికి చెందిన డొంకెన రవీందర్ పెద్దపల్లి జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. 2023లో ధర్మారం మండలం రచ్చపల్లిలో జరిగిన భూ వివాదంలో ఒకరు మృతి చెందగా, దీంతో నలుగురు వ్యక్తులపై కేసు నమోదైంది. బాధిత కుటుంబం తరపున కేసు వాదిస్తున్న పీపీ రవీందర్ తన వక్రబుద్ధి చూపాడు. ఈ కేసులో అనుకూలంగా వ్యవహరిస్తానని, దీనికి రూ.2లక్షలు ఇవ్వాలని నిందితులను డిమాండ్ చేశాడు. ఈ మేరకు సదరు నిందితుడు పీపీ రవీందర్ మిగతా 3లో..

ఇందిరమ్మ కుటుంబ బీమా అమలుకు ఏర్పాట్లు చేయాలి

- సీఎస్ సంజయ్ జాజు
- ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డులో ప్రత్యేక నమోదు కేంద్రాలు
- రూ.2 లక్షల జీవిత బీమా రూ.5 లక్షలకు పెంపు
- నెల రోజుల పాటు నమోదు ప్రక్రియ



హైదరాబాద్, నవంబర్ 18 :
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం మిగతా 3లో..

కుత్బుల్లాపూర్‌లో 6,685 మందికి నూతన చేయూత పింఛన్లు



- ఘనంగా పంపిణీ కార్యక్రమం..
- అర్హులందరికీ అందించాలంటూ బీఆర్ఎస్ డిమాండ్
- పింఛన్ల మంజూరుపై కాంగ్రెస్ ప్రభుత్వ ప్రచార ఆర్భాటమే తప్ప పూర్తి స్థాయిలో న్యాయం జరగలేదని ఎమ్మెల్యే వివేకానంద్ విమర్శ మిగతా 4లో..

ఏపీ ప్రాజెక్టు పనులను
అడ్డుకుంటం

- ఇప్పటికే కేంద్రం, కేఆర్ఎంబీకి ఫిర్యాదులు చేశాం
- సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- కేటీఆర్ అల్టిమేటం నేపథ్యంలో హడావుడిగా ప్రెస్‌మీట్

హైదరాబాద్, నవంబర్ 18 :



నాగార్జునసాగర్ నుంచి తాగునీటి కోసమంటూ ఏపీ ప్రభుత్వం చేపట్టిన పనులను అడ్డుకొని తీరుతామని రాష్ట్ర సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే కేంద్రానికి, కేఆర్ఎంబీ (కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు)కి ఫిర్యాదులు చేశామని తెలిపారు. ఏపీ ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పేరిట నాగార్జునసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ నుంచి సుమారు 7.8 టీఎంసీల జలాలను తాగునీటి కోసం వినియోగించుకొనేందుకు వాటర్‌గ్రిడ్ పథకాన్ని చేపట్టింది. ఏడాది కాలంగా పనులను నిర్వహిస్తున్నది. ఇటీవల అందుకు సంబంధించిన విషయం వెలుగులోకి వచ్చింది. మిగతా 3లో..

బర్డ్ ఫ్లూ నివారణకు స్వదేశీ టీకా..!

భోపాల్‌లోని ఐసీఏఆర్ శాస్త్రవేత్తల సృష్టి
భోపాల్‌లోని ఐసీఏఆర్ శాస్త్రవేత్తల సృష్టి
20న ఆవిష్కరించనున్న కేంద్ర మంత్రి



హైదరాబాద్, నవంబర్ 18 :
పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న 'బర్డ్ ఫ్లూ'ను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త దేశీయ వ్యాక్సిన్‌ను అందుబాటులోకి తెస్తున్నది. ఈ వైరస్ బారి నుంచి పౌల్ట్రీ రంగాన్ని రక్షించడానికి ఈనెల 20న కేంద్రప్రభుత్వం దీనిని జాతికి అంకితం చేయనుంది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన మొట్టమొదటి టీకా ఇది. మధ్యప్రదేశ్ భోపాల్‌లోని ఐసీఏఆర్- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ దీన్ని అభివృద్ధి చేసింది. ఇన్ యాక్టివేటెడ్ హెచ్5ఎన్1 (క్లాడ్ 2.3.2.1ఏ) హైలీ పాథజెనిక్ ఏవియన్ ఇన్ఫ్లూయెంజా వ్యాక్సిన్‌ను ఐసీఏఆర్ అభివృద్ధి చేసింది. ఈ టీకాను కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ భోపాల్‌లో ఆవిష్కరించనున్నారు. ఇప్పటివరకు దేశంలో కోళ్లకు సోకుతున్న బర్డ్ ఫ్లూ కేసుల్లో అత్యధికం హెచ్5ఎన్1 వైరస్‌లోని క్లేడ్ 2.3.2.1ఏ స్ట్రెయిన్‌కు చెందినవే. ఈ రకం వైరస్ కేసులే దేశంలో అత్యధికంగా నమోదవుతున్నాయి. ప్రస్తుతం అంతర్జాతీయంగా కూడా ఈ స్ట్రెయిన్‌ను అడ్డుకోవడానికి ప్రత్యేకంగా ఎలాంటి వ్యాక్సిన్ కూడా అందు బాటులో లేదు. దీంతో ఐసీఏఆర్ దీనిని అభివృద్ధి చేసింది.బర్డ్ ఫ్లూ నివారణకు కొత్తగా వ్యాక్సిన్ అందుబాటులోకి రావడం పట్ల పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ బయాస్, తెలంగాణ పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బర్డ్ ఫ్లూ వైరస్ కోళ్లకు సోకినప్పుడు వ్యాధి తీవ్రత పెరిగి దాదాపు 100 శాతం మిగతా 3లో..

"మేఘా" ఇంజినీరింగ్ విలువ రూ.లక్ష కోట్లు!

- అంతర్జాతీయ ఇన్వెస్టర్ల నుంచి 700 మిలియన్ డాలర్ల నిధుల సమీకరణ
- డీకే, హెచ్‌హెచ్, వర్డే పార్ట్‌నర్స్ భాగస్వామ్యం..
- ఈపీటీఎల్ విలువ రూ.14 వేల కోట్లు మిగతా 3లో..



బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

మాదాపూర్‌లో హైబిజ్ టీవీ హెల్త్‌కేర్ అవార్డుల ప్రదానం





- వైద్యులు, ఆసుపత్రుల ప్రతినిధులకు 80కి పైగా అవార్డులు

హైదరాబాద్, నవంబర్ 18 :

హైబిజ్ టీవీ ఆధ్వర్యంలో నవంబర్ 17న హైదరాబాద్ హైటెక్ సిటీలోని సైబర్ గార్డెన్స్ కన్వెన్షన్ సెంటర్‌లో 2వ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ అవార్డ్స్--2026, 6వ హెల్త్‌కేర్ అవార్డ్స్--2026 వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య నిపుణులు, ఆసుపత్రుల నిర్వాహకులు, వైద్య సంస్థల ప్రతినిధులకు 80కి పైగా అవార్డులను ప్రదానం చేశారు.తెలంగాణ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా, మల్లారెడ్డి విశ్వవిద్యాపీఠ్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ చ. ప్రీతి రెడ్డి, ఏఐజీ ఆసుపత్రుల డైరెక్టర్ డాక్టర్ జి.వి. రావు ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు.వైద్యరంగానికి విశేష సేవలందించిన డాక్టర్ కె.జె. రెడ్డి, డాక్టర్ జి.వి. రావులకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు అందజేశారు. వైద్య సేవలు, నాణ్యమైన వైద్యం, నాయకత్వ ప్రతిభను గుర్తిస్తూ ఈ అవార్డులు ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

హామీ ఇచ్చాం.. అమలు చేశాం!

- ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకున్నాం:
- ఎమ్మెల్యే బండారి, మాజీ కార్పొరేటర్ బన్నాల



హైదరాబాద్, నవంబర్ 18 :

గ్రేటర్ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం బీరప్పగడ్డ డివిజన్ జాహిద్ నగర్‌లో రూ.27 లక్షల వ్యయంతో చేపట్ట నున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలల్లో రోడ్డు నిర్మాణం చేపడతామని ఇచ్చిన హామీ మేరకు పనులకు శ్రీకారం చుట్టిన ట్లు తెలి పారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కొక్కొండ జగన్, ఏదుల్ల కొండల్‌రెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, రామాంజనేయులు, ఫారూక్, ఒబేద్, ఆజాద్, శ్యామ్, బాలు యాదవ్,పాల్గొన్నారు.

జైలు నిర్వహణ, పరిపాలనా వ్యవహారాలపై సంబంధిత అధికారులతో డీజీ స్వాతి లక్రా సమీక్ష



హైదరాబాద్, నవంబర్ 18 : తెలంగాణ జైళ్ల శాఖ డీజీ స్వాతి లక్రా ఐపీఎస్ చంచల్‌గూడ కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జైలు నిర్వహణ, పరిపాలనా వ్యవహారాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఖైదీలకు కల్పిస్తున్న వసతులు, అందిస్తున్న సేవలను స్వయంగా పరిశీలించారు. జైలులోని కీలక విభాగాలు, మౌలిక సదుపాయాలను తనిఖీ చేసి వాటి పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు. ఖైదీల సంక్షేమం, వారికి అందుతున్న సౌకర్యా లపై ఆరా తీశారు. జైలు సిబ్బం దితో మాట్లాడి విధుల నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలపై సమాచారం సేకరించారు. జైళ్లలో సంస్కరణలు అమలు చేయడంతోపాటు ఖైదీలకు మెరుగైన సౌకర్యాలు, సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ ఆఫ్ జనరల్ స్వాతి లక్రా తో పాటు జైళ్ల శాఖ ఐజి లు ఎర్రంశెట్టి రాజేష్. మురళి బాబు. హైదరాబాద్ రేంజ్ డిఐజి సంపత్. చంచల్గూడా జైలు పర్యవేక్షణ అధికారి నవాబు శివకుమార్ గౌడ్. జైలు సిబ్బంది ఉన్నారు. స్వాతి లక్రా జీవిత ఖైదీల పరివర్తనకు సంస్కరణలు ప్రవేశపెట్టాలని సూచించారు. జైలు ను అంతా తిరిగి పరిశీలించారు.

26న చేయూత నూతన పెన్షన్లు, ఇందిరమ్మ చీరల పంపిణీ

- ఇందిరమ్మ స్ఫూర్తితో మహిళలకు గౌరవం- మంత్రి సీతక్క



హైదరాబాద్, నవంబర్ 18 :

రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన సామాజిక న్యాయం, సమానత్వం, గౌరవప్రదమైన జీవనం అనే స్ఫూర్తికి అనుగుణంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అన్నారు. రాజ్యాంగ దినోత్సవమైన నవంబర్ 26న రాష్ట్రవ్యాప్తంగా 4,63,857 మందికి కొత్తగా చేయూత పెన్షన్ దారుల ఖాతాల్లో పెన్షన్ మొత్తాన్ని జమ చేయనున్నట్లు తెలిపారు. అదే రోజు కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.సమాజంలో ఆర్థికంగా అండ అవసరమైన వారికి భద్రత కల్పించడం, మహిళలకు ఆత్మగౌరవం అందించడం ప్రజా ప్రభుత్వ సంక్షేమ విధానంలో కీలక భాగమని మంత్రి పేర్కొన్నారు. అందుకే రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రెండు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు తదితర అర్హులైన వర్గాలకు కొత్తగా మంజూరయ్యే 4,63,857 చేయూత పెన్షన్ల వారి కుటుంబాలకు నెలవారీ ఆర్థిక భరోసాను అందిస్తాయని సీతక్క తెలిపారు. పెన్షన్ మంజూరు కోసం ఎదురుచూస్తున్న అర్హులకు నవంబర్ 26నుంచే ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నామని, పెన్షన్ మొత్తం అదే రోజు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, సమాజంలో ప్రతి వ్యక్తి గౌరవంగా జీవించాలన్న రాజ్యాంగ లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం కల్పిస్తున్న సామాజిక భద్రతకు నిదర్శనమన్నారు. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నవంబర్ 26న విస్తృత స్థాయిలో ముందుకు తీసుకెళ్లనున్నామని మంత్రి తెలిపారు. కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలను అందించే కార్యక్రమానికి ఆరోజు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. తెలంగాణ ఆడబిడ్డకు చీర అంటే కేవలం వస్త్రం కాదని, పుట్టింటి ఆత్మీయత, గౌరవానికి ప్రతీక అని సీతక్క అన్నారు. ఆడబిడ్డను గౌరవించే తెలంగాణ సంప్రదాయాన్ని కొనసా గిస్తూ ఇందిరమ్మ చీరలను అందిస్తున్నామని తెలిపారు.మహిళలకు చీర అందించడంతో పాటు వారిని ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళా ఉన్నతి--తెలంగాణ ప్రగతి లక్ష్యంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు, ఉపాధి, వ్యాపార అవకాశాలు, మార్కెట్ సదుపాయాలను కల్పిస్తూ ఆర్థిక సాధికారత దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు.రాజ్యాంగ స్ఫూర్తితో నవంబర్ 26న ఒకే వేదికగా రెండు కీలక కార్యక్రమాలు ప్రారంభం కావడం ద్వారా ప్రజా ప్రభుత్వం తన పాలనా దృక్పథాన్ని చాటుతోందని సీతక్క అన్నారు. చేయూత ద్వారా బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా.. ఇందిరమ్మ చీర ద్వారా మహిళలకు ఆత్మీయత, గౌరవం అందిస్తున్నామని పేర్కొన్నారు.రాజ్యాంగం నిర్దేశించిన సామాజిక న్యాయం, సమానత్వం ప్రతి కుటుంబానికి చేరేలా ప్రభుత్వం పనిచేస్తోందని, మహిళలు ఆర్థికంగా ఎదిగి రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వాములుగా మారేలా మరిన్ని కార్యక్రమాలను కొనసాగిస్తామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

ఫీజు బకాయిలు వెంటనేచెల్లించాలి

- 16 లక్షల మంది విద్యార్థులకు న్యాయం చేయాలి..
- 6 లక్షల మందికి సర్టిఫికెట్లు ఇప్పించాలి
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య



హైదరాబాద్, నవంబర్ 18 :

పెండింగ్‌లో ఉన్న రూ.8 వేల కోట్ల ఫీజు రీయిం బర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి, సర్టిఫికెట్లు అందక ఇబ్బందులు పడుతున్న ఆరు లక్షల మంది విద్యార్థులకు న్యాయం చేయాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్య క్షుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఫీజు బకాయిల విడుదల, సర్టిఫికెట్ల సాధన కోసం బుధవారం రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు పగిళ్ల సతీష్ ఆధ్వర్యంలో వేలా ది మంది విద్యార్థులు చాపెల్ రోడ్డులోని స్టాలినీ కళాశాల నుంచి బషీర్‌బాగ్ చౌరస్తా వరకు భారీ ప్రదర్శన నిర్వహి ంచారు.ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు సర్టిఫికె ట్లు పొందలేక ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు చెల్లించే వరకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. పరీక్షల సమయంలో హాల్‌టికెట్లు, తదుపరి కోర్సుల్లో ప్రవే శాలకు అవసరమైన సర్టిఫికెట్లు అందక విద్యార్థులు ఇబ్బం దులు పడుతున్నారని తెలిపారు.అసెంబ్లీలో ఫీజు బకాయి లు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్ప టివరకు చెల్లింపులు జరగలేదని విమర్శించారు. విద్యా ర్థులకు ఫీజు లు మంజూరైన వెంటనే వారి మొబైల్ ఫోన్లకు వివరాలతో కూడిన సందేశాలు పంపాలని సూచించారు. ఎలాంటి షరతులు లేకుండా రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని, పాత ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని కొనసాగిం చాలని డిమాండ్ చేశారు. అడ్మిషన్ల సమయంలో విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయరాదని, ఎన్నికల హామీ మేరకు పూర్తి ఫీజులను ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను ఆంధ్రప్రదేశ్ తరహాలో రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్ర మంలో నీలా వెంకటేష్, అనంతయ్య, రాజేందర్, శివకు మార్ యాదవ్, మోదీ రాందేవ్, భీమా రాజు, నిఖిల్ పటేల్, నరేష్ గౌడ్, అల్లం యాదవ్, బాలయ్య, వంశీ, కిరణ్ పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతానికి ఫైర్ స్టేషన్ కరువు!

- అగ్నిప్రమాదాలు జరిగితే అంతే సంగతులు.. వేలాది పరిశ్రమలకు రక్షణ ఏది?
- త్వక్షణమే అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్



హైదరాబాద్, నవంబర్ 18 :

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ బాలా నగర్ డివిజన్ పరిధిలోని పారిశ్రామికంగా శరవేగం గా అభివృద్ధి చెందు తున్న బాలానగర్ ప్రాంతంలో అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన అగ్నిమాపక కేంద్రం (ఫైర్ స్టేషన్) లేకపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలానగర్ పారిశ్రామిక వాడలో వేలాది చిన్న, మధ్యతరహా, భారీ పరి శ్ర మలు, గోదాములు, వాణిజ్య సముదాయాలు కార్యకలా పాలు నిర్వహిస్తున్నాయి. ఇంతటి కీలకమైన పారిశ్రామిక ప్రాంతంలో ప్రత్యేక ఫైర్ స్టేషన్ అందుబాటులో లేకపో వడం వల్ల అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు సకాలంలో సహాయక చర్యలు అందడం లేదని స్థానిక ప్రజలు, పారిశ్రా మికవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతంలో బాలా నగర్‌లోని ఐడీపీఎల్ పరిశ్రమకు అనుబంధంగా అగ్ని మాపక కేంద్రం అందుబాటులో ఉండేదని, ఐడీపీఎల్ పరి శ్రమ మూతపడిన అనంతరం అక్కడి ఫైర్ స్టేషన్‌ను కూడా ఇతర ప్రాంతానికి తరలించారని స్థానికులు చెబుతున్నారు. అప్పటి నుంచి బాలానగర్ పారిశ్రామిక ప్రాంతానికి సొం తంగా అగ్నిమాపక కేంద్రం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నా యని పేర్కొంటు న్నారు. తరచూ చోటుచేసుకుంటున్న అగ్నిప్రమాదాలు తప్పని ఆందోళన బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలో అగ్నిప్ర మాదాల ముప్పు ఎంత తీవ్రంగా ఉందో గతంలో జరిగిన ఘటనలు స్పష్టం చేస్తున్నాయి. 2025 జూలై 17న ఫతేనగర్‌లోని డ్యూరోడైన్ ఇండస్ట్రీస్ ప్లేట్ తయారీ పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం సంభవించిం ది. మంట లను అదుపు చేసేందుకు నాలుగు ఫైర్ ఇంజిన్లను రంగం లో కి దించాల్సి వచ్చింది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగలేదు. అదే విధంగా 2025 జూలైలో బాలానగర్‌లోని మరో పేపర్, స్టీల్ ప్లేట్ల తయారీ పరిశ్రమలో షార్ట్ సర్క్యూ ట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగినట్లు అనుమానించారు. ఈ ఘటనలో సుమారు రూ.5 కోట్ల ఆస్తి నష్టం జరిగినట్లు అప్పట్లో అంచనా వేశారు. మంటలను అదుపు చేసేందుకు ఐదు ఫైర్ ఇంజిన్లు దాదాపు ఐదు గంటలపాటు శ్రమిం చాయి. ఈ ఘటనలు పారిశ్రామిక ప్రాంతంలో అగ్నిమాపక సదుపాయాల ప్రాధాన్యతను మరోసారి గుర్తుచేస్తున్నాయి. అగ్నిప్రమాదం ప్రారంభమైన తొలి నిమిషాలే అత్యంత కీలకం. ఆ సమయంలో ఫైర్ సిబ్బంది అందుబాటులో లేకపోతే మంటలు పక్కనున్న పరిశ్రమలకు, గోదాములకు, నివాస ప్రాంతాలకు వ్యాపించే ప్రమాదం ఉంది. దీంతో కోట్లాది రూపాయల ఆస్తి నష్టంతో పాటు కార్మికులు, స్థానిక ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. హైదరాబాద్‌లోనూ పెరుగుతున్న అగ్ని ప్రమాదాల ముప్పు హైదరాబాద్ నగరంలో అగ్నిమాపక సదు పాయాల కొరతపై కూడా గతంలో పలు నివేదికలు వెలువడ్డాయి. 2026 జూన్‌లో ప్రచురితమైన టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో సుమారు 40 ఫైర్ స్టేషన్లు మాత్రమే ఉండగా, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం దాదాపు 200 అవస రమని అంచనా వేశారు. అగ్నిమాపక వాహనాలు చేరుకోవడానికి సగటున 20 నుంచి 30 నిమిషాలు పడుతున్నట్లు కూడా ఆ కథనం పేర్కొంది. ఈ నేపథ్యంలో బాలానగర్ వంటి పారిశ్రామిక ప్రాంతాల్లో అగ్నిమాపక సదుపాయాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడు తున్నారు. బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలోని ప్రజలు, కార్మికులు, పరిశ్రమల యజమానుల భద్రతను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు.. ప్రమాదం జరగకముందే ప్రాణాలను కాపాడే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. బాలానగర్‌కు ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి.. పారిశ్రామిక ప్రాంత ప్రజల ప్రాణాలకు భరోసా కల్పించాలి అంటూ స్థానికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

రేపు సిద్ధిపేట జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- రూ.544.11 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



సిద్ధిపేట, నవంబర్ 18

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం (నవం బర్ 19) సిద్ధిపేట జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. జిల్లా పర్య టనలో భాగంగా మొత్తం రూ.544.11 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో రూ.451.13 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేయనుండగా, ఇప్పటికే రూ.92.98 కోట్లతో పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభించ నున్నారు.దుబ్బాక, సిద్ధిపేట నియోజకవర్గాల్లో రూ.200 కోట్ల చొప్పున నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు.జిల్లాలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో రూ.15.44 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి, రూ.13.50 కోట్లతో ఆరు తహసీల్దార్ కార్యాలయ భ వనాల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.చిన్నకోడూరు మం డ లంలో రూ.7.50 కోట్లతో, దౌల్తాబాద్ మండలంలో రూ.7.80 కోట్లతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూళ్లకు కూడా శంకుస్థా పన చేయనున్నారు. జనగామ నియోజకవర్గంలో రూ.6.89 కోట్లతో నిర్మించనున్న మూడు విద్యుత్ సబ్‌స్టేషన్లకు ముఖ్యమంత్రి శంకు స్థాపన చేయనున్నారు. సిద్ధిపేట జిల్లాలో రూ.54.67 కోట్లతో నిర్మిం చిన 14 విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రారం భించనున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లన్న ఆలయంలో రూ.14.35 కోట్లతో నిర్మించిన వసతి సత్రాన్ని, రూ.12 కోట్లతో నిర్మించిన క్యూ కాం ప్లెక్స్‌ను ముఖ్యమంత్రి ప్రారం భిం చను న్నారు. అలాగే రూ.6.50 కోట్లతో నిర్మించిన 53 గ్రామ మహిళా సంఘాల భవనా లను, రాయపోల్ మండలంలో రూ.3.87 కోట్లతో నిర్మించిన కస్తూ ర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనాన్ని, గజ్వేల్‌లో రూ.1.59 కోట్లతో నిర్మించిన విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో సిద్ధిపేట జిల్లాలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

సిమెంట్, కాంక్రీట్ రంగంపై జాతీయ సదస్సు

- నెట్‌జీరో లక్ష్యాలు, కర్బన ఉద్గారాల తగ్గింపుపై చర్చలు
- 50 స్టాళ్లతో సాంకేతిక ప్రదర్శన

హైదరాబాద్, నవంబర్ 18 : హైదరాబాద్, నవంబర్ 18: సిమెంట్, కాంక్రీట్ రంగంలో పర్యావరణ పరిరక్షణ, కర్బన ఉద్గారాల తగ్గిం పు, నెట్‌జీరో లక్ష్యాల సాధన దిశగా నేషనల్ కౌన్సిల్ ఫర్ సిమెంట్ అండ్ బిల్డింగ్ మెటీరియల్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రెండు రోజుల జాతీయ సదస్సు, సాంకేతిక ప్రదర్శన నిర్వహిం చనున్నారు.'సుస్థిరమైన, నెట్‌జీరో భవిష్యత్తు వైపు' అనే ఇతివృత్తంతో ఈ నెల 19, 20 తేదీల్లో గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, సెంటినరీ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరగనుంది.కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక విభాగంఈ సదస్సుకు మద్దతు అందిస్తున్నాయి. సిమెంట్ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, సాంకేతిక నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలు, కస్టల్టెంట్లు పాల్గొని పరిశ్రమ ఎదుర్కొంటున్న భవిష్యత్ సవాళ్లు, ఆధునిక సాంకే తిక పరిజ్ఞానం, పర్యావరణహిత ఉత్పత్తి విధానాలపై చర్చించను న్నారు.ఈ నెల 19న జరిగే ప్రారంభోత్సవానికి మై హోమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ డైరెక్టర్ (టెక్నికల్) వి.ఎస్. నారంగ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సీపీడబ్ల్యూడీ అదనపు డైరెక్టర్ జనరల్ దేవజ్యోతి రాయ్ చౌదరి, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ చీఫ్ సస్టైనబిలిటీ అండ్ ఇన్నో వేషన్ ఆఫీసర్ మనోజ్ రుస్తగి గౌరవ అతిథులుగా పాల్గొంటారు. ఎన్‌సీబీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎల్.పి. సింగ్, జాయింట్ డైరెక్టర్, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బి. పాండు రంగారావు పాల్గొ ననున్నారు.సదస్సులో తక్కువ కర్బన ఉద్గారాలతో సిమెంట్ తయా రీ, ఇంధన సామర్థ్యం పెంపు, ప్రత్యామ్నాయ ఇంధనాల వినియో గం, కార్బన్ క్యాప్చర్ అండ్ యుటిలైజేషన్, కాంక్రీట్‌లో మినరల్ కార్బనేషన్, అల్ట్రా హై పెర్ఫార్మెన్స్ కాంక్రీట్, 3డీ ప్రింటింగ్ కాంక్రీట్, డిజిటల్ టెక్నాలజీ, ఆటోమేషన్ వంటి కీలక అంశాలపై సాంకేతిక చర్చలు నిర్వహించనున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రం అండతో ఏపీ జలదోపిడీ

ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు.ఏపీ జలదోపిడీని అడ్డుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) వద్ద ప్రత్యేకంగా ఎలాంటి చర్యలు తీసుకుంటోందని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణకు మిగిలిన 40 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాల కోసం కేటాయించాలని ప్రభుత్వం కోరిందా? ఏపీ నీటి తరలింపును అడ్డుకోవాలని కేఆర్ఎంబీకి ఏమైనా లేఖ రాసిందా? అని నిలదీశారు. హైదరాబాద్‌తో పాటు నల్గొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల తాగునీటి అవసరాల కోసం కృష్ణా నదిలో ఎంత నీటిని నిల్వ ఉంచారో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా జిల్లాల ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటి కేటాయింపులపై ప్రభుత్వం సమగ్ర వివరాలు వెల్లడించాలని కోరారు.కేఆర్ఎంబీ వద్ద ఏపీ నీటి తరలింపుపై తెలంగాణ ప్రభుత్వం ఏమైనా నిరసన వ్యక్తం చేసిందా? రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా విషయంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వం ఇష్టానుసారంగా నీటిని తరలిస్తుంటే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని స్పష్టం చేశారు. అవసరమైతే ఈ అంశంపై ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో న్యాయపోరాటాలు చేస్తామని కేటీఆర్ తెలిపారు. అంతేకాకుండా బహిరంగ సభలు నిర్వహించి కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రజలను చైతన్యవంతం చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి రావాల్సిన నీటి హక్కులను సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.

ఆంధ్రా బాబు కుట్రలో బీజేపీకీ భాగస్వామ్యం

నల్లగొండ జిల్లాలను ముంచిందే కాంగ్రెస్ అని ధ్వజమెత్తారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు అనంతరం నల్లగొండ జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించేలా నిజాం రూపొందించిన ఏలేశ్వరం ప్రాజెక్టును అక్కడి నుంచి నందికొండకు మార్చారని, తద్వారా నల్లగొండ జిల్లాకు తీరని విద్రోహం చేశారని వివరించారు. ఫ్లోరోసిస్‌ను నల్లగొండకు గిఫ్ట్‌గా ఇచ్చింది కాంగ్రెస్సేనని నిప్పులు చెరిగారు. అప్పర్ కృష్ణా, భీమా, ఆర్డీఎస్ తదితర ప్రాజెక్టుల ద్వారా 174 టీఎంసీల కృష్ణాజలాలను మళ్లించి ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు నిజాం రాజు చేసిన ప్రణాళికలను తుంగలో తొక్కిందని, పాలమూరును వలసల జిల్లాగా మార్చిందని నిప్పులు చెరిగారు. చంద్రబాబుకు కూడా ఇందులో పాత్ర ఉన్నదని వివరించారు. పాలమూరు జిల్లాను దత్తత తీసుకున్న తర్వాత ఇంకా అధోగతి పాలైందని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నదీజలాల్లో జరిగిన అన్యాయానికి కాంగ్రెస్‌తోపాటు, టీడీపీ కూడా కారణమేనని నిప్పులు చెరిగారు.

ఇందిరమ్మ కుటుంబ బీమా అమలుకు ఏర్పాట్లు చేయాలి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీతో పాటు అన్ని మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం వివిధ వర్గాలకు అమలవుతున్న బీమా పథకాలను ఇందిరమ్మ కుటుంబ బీమా పరిధిలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. నేతన్నలు, గౌడులు, కార్మికులు, మత్స్య కారులకు ప్రస్తుతం అందిస్తున్న రూ.2 లక్షల జీవిత బీమాను ఇందిరమ్మ బీమా పరిధిలోకి తీసుకురావడం ద్వారా రూ.5 లక్షలకు పెంచనున్నట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా భద్రత కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి అర్హ కుటుంబంలోని సభ్యులందరూ పథకంలో నమోదు చేసుకునేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రజలకు అవగాహన కల్పించేందుకు అన్ని ప్రచార మాధ్యమాలను వినియోగించాలని సూచించారు. పథకం మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ నమోదు ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. దాదాపు నెల రోజుల పాటు కొనసాగనున్న నమోదు ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, పౌర సరఫరాల కమిషనర్ నాగిరెడ్డి, కార్మిక శాఖ కార్యదర్శి హరిచందన, ఐటీ శాఖ ప్రత్యేక కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ నివారణకు స్వదేశీ టీకా..!

వరకు మరణాలు సంభవించేవని, వైరస్ ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా అరికట్టడానికి కోళ్లను సామూహిక సమాధి చేయాల్సి వచ్చేదన్నారు. దీనివల్ల పౌల్ట్రీ రైతులకు తీరని నష్టం వాటిల్లేదన్నారు. ఒకవేళ బర్డ్ ఫ్లూ అదుపు తప్పి విస్తృతంగా వ్యాపిస్తే.. మొత్తం కోళ్లలో 20 శాతానికి పైగా నాశనం అయ్యేవన్నారు. దీని ప్రభావం స్థూల జాతీయోత్పత్తి వృద్ధిని సైతం దెబ్బకొడుతుందన్నారు. 2006లో సంభవించిన బర్డ్ ఫ్లూ వల్ల దేశంలో దాదాపు 3,000 కోట్ల రూపాయల వరకు ప్రత్యక్ష, పరోక్ష నష్టం వాటిల్లిందని ఉదయ్‌సింగ్ వెల్లడించారు. బర్డ్ ఫ్లూ కోళ్లు, ఇతర పక్షులకే కాకుండా ప్రజారోగ్యానికి కూడా సవాల్‌గా మారుతున్నదన్నారు. ఈ వ్యాక్సిన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే పౌల్ట్రీ పరిశ్రమలో స్థిరత్వం ఏర్పడుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. కోడిమాంసం, గుడ్ల ధరల పెరుగుదలను కూడా అరికట్టే అవకాశాలుంటాయని బయాస్ పేర్కొన్నారు.

క్రీడారంగంపై సర్కార్ చిన్నచూపు : హరీశ్‌రావు

క్రీడాకారులకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో సత్తా చాటే సామర్థ్యం ఉన్నప్పటికీ, సర్కార్ ప్రోత్సాహంలేక వారి భవిష్యత్ ఆగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఖేలో ఇండియా పోటీలకు ప్రధానిని ఆహ్వానిస్తున్న రేవంత్‌రెడ్డి, క్రీడాకారులకు కోచ్‌లను నియమించాలనే కనీస సోయి లేదా? అని నిలదీశారు. విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడాప్రతిభను వెలికితీసే ఖాళీగా ఉన్న పీఈటీ, ఫిజికల్ డైరెక్టర్ల పోస్టులను భర్తీ చేయాలనే ఆలోచనలేకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'కోచ్‌లు లేకుంటే వారికి ఎవరు మార్గదర్శనం చేస్తారు? పీఈటీలు, పీడీలు లేకుండా మీరు ఏర్పాటు చేస్తానంటున్న స్పోర్ట్స్ యూనివర్సిటీ లక్ష్యం ఎలా నెరవేరుతుంది?'అని ప్రశ్నించారు. ఖేలో ఇండియా పోటీల్లో తెలంగాణ సత్తాచాటాలంటే ముందుగా కోచ్‌లను నియమించాలని, వెంటనే పీఈటీ, పీడీల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు, నగదు ప్రోత్సాహకాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామీణస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ప్రయాణ, వసతి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. క్రీడా బడ్జెట్‌కు నిధుల కేటాయింపును పెంచి ఖర్చుచేయడంలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటును వేగవంతం చేసి, ఆధునిక శిక్షణ కేంద్రాలు, మైదానాలు, క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయాలని, క్రీడల్లో రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకమైన ఎంపిక విధానం కల్పించాలని అన్నారు. క్రీడారంగ అభివృద్ధి అంటే స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రకటనలు, మైకుల ముందు ప్రగల్భాలు కాదని, ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడం, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైతం అవకాశాలు కల్పించడమని హితవుపలికారు. క్రీడాకారుల భవిష్యత్తుతో చెలగాటమాడడం మానేసి, హకులను కాపాడి, వారి ఆశయ సాధనకు తోడ్పాటు అందించాలని డిమాండ్ చేశారు.

వాహ్.. వాయేజర్..! 49 ఏండ్ల ప్రయాణం..



61 వేల కిలోమీటర్ల వేగంతో దూసుకువెళ్తున్నది. భూమి నుంచి పంపే ఆదేశం వాయేజర్-1కు చేరడానికి 24 గంటలు పడుతుంది.అక్కడి నుంచి పంపే సమాచారం తిరిగి భూమికి రావడానికి మరో 24 గంటలు పడుతుంది. అంటే ఒక ఆదేశానికి సంబంధించిన ప్రతిస్పందన తెలుసుకునేందుకు నాసా శాస్త్రవేత్తలు దాదాపు రెండు రోజులు వేచి చూడాలి. తొలుత బృహస్పతి, శని గ్రహాలను అధ్యయనం చేసేందుకు రూపొందించిన వాయేజర్-1 గతంలో 1979లో బృహస్పతిని, 1980లో శనిని పరిశీలించింది. 2012 ఆగస్టులో సూర్యుడి ప్రభావ పరిధిని దాటి అంతర్ నక్షత్ర అంతరిక్షంలోకి ప్రవేశించిన తొలి వ్యోమనౌకగా రికార్డు సృష్టించింది. ప్లూటోనియం-238 రేడియోధార్మిక క్షయం ద్వారా ఉత్పత్తయ్యే శక్తితో ఇది పనిచేస్తుంది.కాలక్రమేణా విద్యుత్ తగ్గుతుండటంతో నాసా కొన్ని పరికరాలను నిలిపివేసి, కీలక వ్యవస్థలను కొనసాగిస్తున్నది. 1970 నాటి కంప్యూటర్లతో ఇంత దూరం నుంచి వ్యోమనౌకను నిర్వహించడం సవాలుగా మారింది. వాయేజర్-1లో గోల్డెన్ రికార్డ్ పేరుతో బంగారు పూత పూసిన రాగి డిస్క్‌ను పంపించారు. ఇందులో భూమిపై ఉండే జీవజాలం, ప్రకృతి శబ్దాలు, సంగీతం, చిత్రాలు, వివిధ భాషల్లో సందేశాలు ఉన్నాయి. గ్రహాంతర నాగరికతలకు భూమిని గురించి తెలియజేయడం దీని ఉద్దేశం. దాదాపు అర్ధ శతాబ్దంగా కొనసాగుతున్న ఈ ప్రయాణం మానవ సాంకేతికత పరిజ్ఞానానికి నిదర్శనంగా నిలుస్తున్నది.

రీల్ మేకర్లకు జర్నలిస్టుల రక్షణ వర్తించదు..

- సుప్రీంకోర్టులో ఢిల్లీ పోలీసుల అఫిడవిట్
- జర్నలిస్టులు, కంటెంట్ క్రియేటర్ల మధ్య వ్యత్యాసం ఉందని స్పష్టీకరణ
- నిరసనల్లో కెమెరాలు, మైక్రోఫోన్లతో పాల్గొన్న కంటెంట్ క్రియేటర్లు
- ప్రెస్ కేటగిరీ కింద లభించే రక్షణ అందరికీ వర్తించదని వెల్లడి
- జర్నలిస్టుల హోదాను రీల్ మేకర్లకు ఇవ్వాలా? ప్రభుత్వమే నిర్ణయించాలని సూచన

న్యూఢిల్లీ, నవంబర్ 18 : జర్నలిస్టులకు కల్పించే రక్షణ, ప్రయోజనాలు సోషల్ మీడియా రీల్ మేకర్లు, కంటెంట్ క్రియేటర్లకు వర్తించవని ఢిల్లీ పోలీసులు సుప్రీంకోర్టుకు తెలిపారు. జర్నలిస్టులు, రీల్ మేకర్లు వేర్వేరు వర్గాలని, కేవలం కంటెంట్ క్రియేట్ చేసే వారికి జర్నలిస్టులకు వర్తించే రక్షణ నిబంధనలను అమలు చేయలేమని స్పష్టం చేశారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు.పోలీసులు తమ విధులను అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ పలువురు జర్నలిస్టులు సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. దీనికి ప్రతిగా ఢిల్లీ పోలీ సులు తమ వాదనలను కోర్టు ముందు ఉంచారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ నిరసన చేపట్టిన సమయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై వివాదం నెలకొంది. ఆ సమయంలో పోలీసులు అతిగా ప్రవర్తించారని ఆరోపిస్తూ నెట్‌వర్క్ ఆఫ్ ఉమెన్ ఇన్ మీడియా, ఫ్రీ స్పీచ్ కలెక్టివ్, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్‌తో పాటు పలు మీడియా సంస్థలు ఢిల్లీ పోలీసులపై అఫిడవిట్ దాఖలు చేశాయి.ఈ ఆరోపణలను ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, జాయింట్ కమిషనర్ సురేంద్ర కుమార్ తమ కౌంటర్ అఫిడవిట్‌లో సమర్థించారు. నిరసన ప్రదర్శన సమయంలో యూట్యూబ్ రీల్స్ కోసం కంటెంట్ రూపొందించే పలువురు కెమెరాలు, మైక్రోఫోన్లు పట్టుకుని అక్కడికి వచ్చారని పోలీసులు పేర్కొన్నారు. దీంతో అసలైన జర్నలిస్టులు, రీల్ మేకర్ల మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడం కష్టంగా మారిందని వివరించారు. కంటెంట్ క్రియేటర్లను అడ్డుకోవడం తమ ఉద్దేశం కాదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. అయితే నిరసన ప్రదర్శనల సమ యంలో జర్నలిస్టులకు వర్తించే మార్గదర్శకాలు, రక్షణ నిబంధనలు వేరుగా ఉంటాయని తెలిపారు. కేవలం సోషల్ మీడియా కంటెంట్ కోసం కెమెరాలు, మైక్రోఫోన్లు పట్టుకుని వచ్చే వారికి ఆ నిబంధనలు వర్తించవని పేర్కొన్నారు.అధికారిక మీడియా పాత్రను తాము సంపూర్ణంగా గౌరవిస్తామని, అయితే జర్నలిస్టులకు, కంటెంట్ క్రియేటర్లకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉందని అఫిడవిట్‌లో వివరించారు. నిరసన ప్రదర్శనల సమయంలో ప్రెస్ కేటగిరీ కింద జర్నలిస్టులకు కల్పించే రక్షణను సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్లు పొందలేరని పేర్కొన్నారు.జర్నలిస్టులు, రిపోర్టర్లకు కల్పించే హోదా, రక్షణలను రీల్ మేకర్లకు కూడా ఇవ్వాలా? లేదా? అనే అంశాన్ని ప్రభుత్వం నిర్ణయించాలని ఢిల్లీ పోలీసులు అభిప్రాయపడ్డారు. వేల సంఖ్యలో నిరసనకారులు పాల్గొనే ప్రదర్శనలను నియంత్రించడం పోలీసులకు సవాలుగా ఉంటుందని, ఇలాంటి పరిస్థితుల్లో కంటెంట్ క్రియేటర్లు కూడా జర్నలిస్టుల మాదిరిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. అందువల్ల నిరసనల సమయంలో జర్నలిస్టులకు లభించే ప్రత్యేక రక్షణ ప్రయోజనాలను రీల్ మేకర్లకు వర్తింపజేయలేమని ఢిల్లీ పోలీసులు తమ అఫిడవిట్‌లో స్పష్టం చేశారు.



ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కారుకు ప్రమాదం..

- తృటిలో తప్పిన పెను ముప్పు!
- కొత్తూరు బైపాస్ సమీపంలో డీసీఎం వాహనాన్ని ఢీకొన్న కారు
- తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా అర్ధరాత్రి ఘటన
- కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం.. డ్రైవర్, సోదరుడికి స్వల్ప గాయాలు
- బల్మూరి వెంకట్, ఆయన భార్యకు తప్పిన ప్రమాదం



న్యూఢిల్లీ, నవంబర్ 18 : కాంగ్రెస్ ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూరి వెంకట్ ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. రంగారెడ్డి జిల్లా కొత్తూరు జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ప్రమాదం చోటు చేసుకుంది. తిరుపతి నుంచి హైదరాబాద్‌కు తిరిగి వస్తుండగా ఆయన ప్రయాణిస్తున్న కారు ముందుగా వెళ్తున్న డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. అయితే బల్మూరి వెంకట్, ఆయన సతీమణి ఎలాంటి ప్రాణాపాయం లేకుండా బయటపడటంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకు న్నారు. వివరాల్లోకి వెళ్తే.. బల్మూరి వెంకట్ తన భార్య, సోదరుడు చాణక్య, డ్రైవర్ శ్రీకాంత్‌తో కలిసి తిరుపతి నుంచి హైదరాబాద్‌కు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో కొత్తూరు బైపాస్ సమీపంలోని దర్గా చౌరస్తా వద్దకు చేరుకోగానే ముందుగా వెళ్తున్న కోళ్ల లోడుతో ఉన్న డీసీఎం వాహనాన్ని కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టినట్లు తెలుస్తోంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం.డీసీఎం వాహనాన్ని ఢీకొనడంతో కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో డ్రైవర్ శ్రీకాంత్, ఎమ్మెల్సీ సోదరుడు చాణక్య స్వల్పంగా గాయపడ్డారు. అయితే కారులో ప్రయాణిస్తున్న బల్మూరి వెంకట్, ఆయన భార్యకు ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. దీంతో పెను ప్రమాదం నుంచి బయటపడిన ఎమ్మెల్సీ దంపతులు క్షేమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఊపిరి పీల్చుకున్నారు.ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించి, ఘటన ఎలా జరిగిందనే అంశంపై విచారణ చేపట్టారు. డీసీఎం వాహనాన్ని కారు ఢీకొట్టడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

"మేఘా" ఇంజినీరింగ్ విలువ రూ.లక్ష కోట్లు!




- అంతర్జాతీయ ఇన్వెస్టర్ల నుంచి 700 మిలియన్ డాలర్ల నిధుల సమీకరణ
- డీకే, హెచ్‌హెచ్, వర్డే పార్ట్‌నర్స్ భాగస్వామ్యం..

ఈపీటీఎల్ విలువ రూ.14 వేల కోట్లు

హైదరాబాద్, నవంబర్ 18 :
దేశీయ మౌలిక సదుపాయాల రంగంలో కీలక సంస్థగా ఎదిగిన మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) గ్రూప్ విలువ సుమారు రూ.లక్ష కోట్లకు చేరింది. అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన మూడు పెట్టుబడి సంస్థలు డీకే, హెచ్‌హెచ్, వర్డే పార్ట్‌నర్స్ (ఎతీఎవ వ్రాఖతీఅవతీం) సంస్థాగత పెట్టుబడి లావాదేవీలో భాగస్వాములయ్యాయి. ఈ ఒప్పందం ద్వారా సుమారు 700 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.5,800 కోట్ల) నిధుల సమీకరణకు మార్గం సుగమమైంది. గ్రూపునకు చెందిన రహదారి ప్రాజెక్టుల ఆస్తుల నగదీకరణ ప్రతిపాదనతో పాటు నిర్మాణాత్మక ఈక్విటీ పెట్టుబడుల విధానంలో ఈ లావాదేవీ జరిగినట్లు అభివృద్ధితో సంబంధం ఉన్న వర్గాలు వెల్లడించాయి.భారత్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రానున్న దశాబ్దంలో భారీ అవకాశాలు ఉన్నాయని అంతర్జాతీయ పెట్టుబడిదారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో విస్తృతమైన వ్యాపార కార్యకలాపాలు, భారీ ప్రాజెక్టులను నిర్దిష్ట ప్రమాణాలతో పూర్తి చేయగల సామర్థ్యం ఉన్న ఎంఈఐఎల్ గ్రూప్‌లో పెట్టుబడులకు ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. నీటిపారుదల, రవాణా, ఇంధనం, చమురు-వాయువు, తయారీ, విద్యుత్ వాహనాలు వంటి విభిన్న రంగాల్లో గ్రూపు కార్యకలాపాలు పెట్టుబడిదారుల విశ్వాసానికి కారణమయ్యాయి. ఎం ఈఐఎల్ ప్రధాన సంస్థ విలువను సుమారు రూ.లక్ష కోట్లుగా అంచనా వేయగా.. గ్రూపునకు చెందిన ఇంధన పరివర్తన వ్యాపార సంస్థ ఈపీటీఎల్ (జ్రూూ) విలువను ప్రస్తుత దశలో సుమారు రూ.14 వేల కోట్లుగా నిర్ణయించినట్లు సమాచారం. ఈ అంచనాలు సంస్థల కార్యకలాపాల విస్తృతి, భవిష్యత్తులో పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ నిల్వ, ఇతర ఇంధన రంగాల్లో ఉన్న అవకాశాలను ప్రతిబింబిస్తున్నాయి."భారత్ దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక ప్రగతిలో భాగస్వాములయ్యే అవకాశంగా అంతర్జాతీయ పెట్టుబడిదారులు ఎంఈఐఎల్ గ్రూపును చూస్తున్నారు. సంస్థ దార్శనికత, విభిన్న వ్యాపార విభాగాలు, నిరూపితమైన ప్రాజెక్టుల అమలు సామర్థ్యంపై వారికి విశ్వాసం ఉంది" అని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. గత మూడు దశాబ్దాలుగా ఎంఈఐఎల్ దేశీయ మౌలిక సదుపాయాల రంగంలో తన కార్యకలాపాలను విస్తరించుకుంటూ వచ్చింది. ప్రస్తుతం 20కి పైగా దేశాల్లో ప్రాజెక్టులను చేపడుతోంది. నీటిపారుదల, రహదారులు, రవాణా, విద్యుత్, చమురు-వాయువు, పారిశ్రామిక తయారీ, స్వచ్ఛ ఇంధనం వంటి రంగాల్లో సంస్థకు వ్యాపార కార్యకలాపాలున్నాయి.దేశంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జోజిలా సొరంగ మార్గం, ముంబయి కోస్టల్ రోడ్, థానే-బోరివలి జంట సొరంగ మార్గం, పోలవరం ప్రాజెక్టు, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వంటి భారీ ప్రాజెక్టుల్లో సంస్థ భాగస్వామిగా ఉంది. గ్రూపునకు చెందిన రహదారి ప్రాజెక్టుల విస్తీర్ణం సుమారు 1,975 కిలోమీటర్లు. ఇంధన రంగంలోనూ ఎంఈఐఎల్ తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. హైడ్రోకార్బన్లు, విద్యుదుత్పత్తి, పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ నిల్వ ప్రాజెక్టుల్లో సంస్థకు అనుభవం ఉంది. మొత్తం 9,110 మెగావాట్లకు పైగా సామర్థ్యం తో పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తోంది. మరోవైపు సుమారు 3,000 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్ ప్రాజెక్టులను అమలు చేస్తోంది.దేశ అణుశక్తి కార్యక్రమంలోనూ సంస్థ అడుగుపెట్టింది. కర్ణాటకలోని కైగా వద్ద 700 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు అణు విద్యుత్ రియాక్టర్ల నిర్మాణంలో భాగస్వామ్యమైంది. అంతర్జాతీయంగా మంగోలి యాలో నిర్మిస్తున్న తొలి గ్రీన్‌ఫీల్డ్ చమురు శుద్ధి కర్మాగారంలోనూ కీలక ప్యాకేజీలను చేపట్టింది. సాంప్రదాయ మౌలిక సదుపా యాలతో పాటు నూతన రంగాల్లోనూ గ్రూపు వ్యాపారాలను విస్తరిస్తోంది. ఒలెక్ట్రా, ఈవీ ట్రాన్స్ సంస్థలు విద్యుత్ బస్సులు, ప్రజా రవాణా రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. డ్రిల్‌మెక్ సంస్థ డ్రిల్లింగ్ సాంకేతికత, ఐకామ్ తయారీ, టెలికమ్యూనికేషన్లు, వ్యూహాత్మక మౌలిక సదుపాయాల రంగాల్లో సేవలందిస్తున్నాయి. మేఘా గ్యాస్ పలు రాష్ట్రాల్లో నగర గ్యాస్ పంపిణీ నెట్‌వర్క్‌ను విస్తరిస్తోంది.వైద్య ఆరోగ్య సేవలు, నైపుణ్యాభివృద్ధి, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లోనూ గ్రూపు తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది.లిభారత మౌలిక సదుపాయాల రంగంలో పెట్టుబడులకు అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో ఎంఈఐఎల్‌కు లభించిన ఈ పెట్టుబడులు, సంస్థకు లభించిన రూ.లక్ష కోట్ల విలువ ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

తీవ్ర తుపాన్ హెచ్చరిక

- బంగాళాఖాతంలో అక్వాన్ తీవ్ర తుపాన్..
- ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు ముప్పు
- ఎల్లుండి మధ్యాహ్నం నరసాపురం-పూరీ మధ్య తీరం దాటే అవకాశం
- తీరం దాటే సమయంలో గంటకు 90-100 కి.మీ వేగంతో ఈదురుగాలులు.. గరిష్ఠంగా 110 కి.మీ వేగం
- ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ప్రఖర్ జైన్



అమరావతి, నవంబర్ 18
బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తీవ్ర తుపాన్ క్రమంగా ముందుకు కదులుతోంది. గడిచిన ఆరు గంటల్లో గంటకు 8 కిలోమీటర్ల వేగంతో పయనిస్తున్న ఈ తుపాన్ ప్రస్తుతం నరసాపురానికి 540 కిలోమీటర్లు, చెన్నైకి 570 కిలోమీటర్లు, కళింగపట్నానికి 600 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. అలాగే గోపాల్‌పూర్‌కు 690 కిలోమీటర్లు, పూరీకి 770 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు RTGS-APSDMA వెల్లడించింది. అక్వాన్ తీవ్ర తుపాన్ ఎల్లుండి మధ్యాహ్నానికి నరసా పురం-పూరీ మధ్య ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలను తీవ్ర తుపాన్‌గా దాటే అవకాశం ఉందని అంచనా వేసింది. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, గరిష్ఠంగా గంటకు 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చని హెచ్చరించింది. తుపాన్ ప్రభావం నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీఎస్డీఎంఏ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ సూచించారు. తుపాన్ కదలికలు, వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు అరోబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.కోటి విరాళం

- పాఠశాల మౌలిక వసతులు, విద్యా సదుపాయాల అభివృద్ధికి ఆర్థిక చేయూత



హైదరాబాద్, నవంబర్ 18 :
మంచిరేవులలోని యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ అభివృద్ధికి అరోబిందో ఫార్మా ఫౌండేషన్ రూ.కోటి విరాళం అందించింది. ఈ మేరకు బుధవారం ఫౌండేషన్ ప్రతినిధులు డీజీపీ సి.వి. ఆనంద్‌కు కోటి రూపాయల చెక్కును అందజేశారు. అరోబిందో ఫార్మా లిమిటెడ్ వైస్ చైర్మన్, మేనే

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

మందికి కొత్త పెన్షన్ల కోసం 31 మీటింగ్స్ పెడుతున్నారు

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 18 :

కాంగ్రెస్ సర్కార్ కొత్తగా ఇస్తున్నామని చెప్పుకుంటున్న పెన్షన్లకు సంబంధించిన అంశంలో మంత్రి సీతక్కకు, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సవాల్ విసిరారు.ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అధికారిక వెబ్ సైట్ నుంచి తీసుకున్న డాటా, నేను మీడియా మిత్రులందరికీ కూడా పంపిస్తా. 2023 డిసెంబర్ అంటే కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు కొత్త నిజామాబాద్ జిల్లాలో 2, 79, 177 మందికి రూ.2 వేల పెన్షన్ కేసీఆర్ ఇస్తున్నరు. వీళ్ల ప్రభుత్వం వచ్చిన తర్వాత దాంట్లో నుంచి 17,131 మందిని తీసేశారన్నారు.కొంతమంది చనిపోయినవాళ్లుండొచ్చు.. కొందరిని కట్ చేసిర్రు. వివిధ కారణాలతో వారిని తీసేసి ఇప్పుడు కొత్తగా మేం నిజామాబాద్ జిల్లా మొత్తంలో ఇస్తున్నమని చెప్పుకుంటున్న సంఖ్య 20,555. అంటే 17 వేల మందిని తీసేసి 20 వేల మందికి ఇస్తున్నరు.. అంటే మొత్తం జిల్లా లో వారు కేసీఆర్ ఇచ్చిన దాని కంటే అదనంగా ఇస్తున్నది కేవలం 3,424 మందికి మాత్రమే. అదీ రేవంత్ ఇచ్చిన మాట ప్రకారం 4,000 ఇవ్వడంలేదు.. అది కూడా కేసీఆర్ ఇచ్చిన 2,000 మాత్రమే ఇస్తున్నారు.. మరి ఇది కొత్త స్కీమ్ ఎట్లా అయితదని ఎమ్మెల్యే వేముల ప్రశ్నించారు.నువ్వు 4000 పెంచి వృద్ధులు, బీడీ కార్మికులకు ఇస్తే అది కొత్త స్కీం.. దానికి మీటింగ్స్ పెట్టుకోవాలి.. ఈ 3000 మందికి కొత్తగా పెన్షన్లు ఇచ్చేందుకు 31 మీటింగ్స్ ప్రతీ మండలంలో పెడుతున్నరు.. దానికే ప్రతి నియో జక వర్గం లో మంత్రులు, ఎమ్మెల్యేలు సభలు పెడుతున్నారు. తెలంగాణ ప్రజలు, నిజామా బాద్ ప్రజలు దీనిపై ఆలోచన చేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్కకు, జిల్లా మంత్రి అని చెప్పుకుంటున్న సుదర్శన్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కు సవాల్ విసురుతున్నా.. నేను చెనప్పింది తప్ప ని రుజువు చేయకపోతే మీ పదవులకు రాజీ నామా చేస్తరా.. అని ఎమ్మెల్యే వేముల ప్రశ్నించారు.

ఏపీ ప్రాజెక్టు పనులను అడ్డుకుంటం

(మొదటిపేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో ఏపీ చేపట్టిన ప్రాజెక్టుతో తెలంగాణ ప్రయోజనాలకు తీరని విఘాతమని బీఆర్ఎస్ ఆందోళన వ్యక్తం చేసింది. తాజాగా పార్టీ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా ప్రెస్‌మీట్ పెట్టి ప్రభుత్వానికి అల్టిమేటం జారీచేశారు.తక్షణం స్పందించాలని, తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని, లేదంటే ప్రజాక్షేత్రంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. దీంతో సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉన్నపళంగా స్పందించారు. కేటీఆర్ ప్రెస్‌మీట్ ముగిసిన గంటల వ్యవధిలోనే సచివాలయంలో స్వయంగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాగార్జున సాగర్ జలాశయం నుంచి సుమారు 1.8 టీఎంసీల నీటిని తీసుకొనేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన తాగునీటి పథకంపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే తీవ్ర అభ్యంతరాలు తెలిపిందని వెల్లడించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తమ అభ్యంతరాలను పంపామని వివరించారు. తెలంగాణ నీటి హకులను ప్రభావితం చేసే ఏ పథకాన్నైనా వ్యతిరేకిస్తామని, రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

నూతన చేయూత పింఛన్లు

హైదరాబాద్, నవంబర్ 18 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నూతనంగా 6,685 మంది లబ్ధిదారులకు చేయూత సామాజిక భద్రతా పింఛన్లు మంజూరు చేస్తూ బుధవారం కొంపల్లిలోని కేవీఆర్ గార్డెన్స్‌లో ఘనంగా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర వర్గాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పింఛన్లు మంజూరు చేసినట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ చీఫ్ విప్, శాసనమండలి సభ్యుడు డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, అర్హులైన నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో వేలాది నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా కొంత ఊరట లభిస్తుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు సంబంధించి నూతనంగా మంజూరైన పింఛన్ల వివరాలు ఇలా ఉన్నాయి. చింతల్‌లో 1,657 మంది, దుండిగల్‌లో 793 మంది, గాజుల రామారంలో 1,214 మంది, కొంపల్లిలో 1,465 మంది, నిజాంపేట మున్సిపల్ పరిధిలో 520 మంది, కుత్బుల్లాపూర్‌లో 1,036 మంది కలిపి మొత్తం 6,685 మందికి పింఛన్లు మంజూరయ్యాయి. డిసెంబర్ నెల నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో పింఛన్ నగదు జమ కానుంది. మరోవైపు ఇదే కార్యక్రమంపై బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆర్భాటంగా నిర్వహించినప్పటికీ, వాస్తవంగా అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. మూడు సంవత్సరాలుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అనేకమంది నిరుపేదలకు మరోసారి నిరాశే మిగిలిందన్నారు.ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే నెలకు రూ.4 వేల పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఆ హామీని నెరవేర్చలేదని విమర్శించారు. పలుమార్లు దరఖాస్తులు స్వీకరించినప్పటికీ చివరి నిమిషంలో కొంతమందికి మాత్రమే పింఛన్లు మంజూరు చేసి మిగిలిన అర్హులను విస్మరించిందని ఆరోపించారు. 58 సంవత్సరాల వయస్సులో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు ప్రస్తుతం 61 సంవత్సరాలు దాటినా పింఛన్ అందక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలకు కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంపై దృష్టి సారించాలని సూచించారు.

ఏసీబీకి చిక్కిన పబ్లిక్ ప్రాసిక్యూటర్



(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తిగత సహాయకుడు రెడ్డిరాజుల రాజయ్యకు పెద్దపల్లి పట్టణంలో రూ. 1.50 లక్షల లంచం ఇస్తుండగా, ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రవీందర్‌తో పాటు వ్యక్తిగత సహాయకుడు రాజయ్యను అదుపులోకి తీసుకుని, నగదు స్వాధీనం చేసుకుని కరీంనగర్ ఏసీపీ కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. బాధితులకు న్యాయం చేయాల్సిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ లంచగొండి అవతార మెత్తి నిందితులకు అనుకూలంగా వ్యవహరి స్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి

రోడ్డెక్కిన విద్యార్థినులు..



హైదరాబాద్, నవంబర్ 18 : కాంగ్రెస్ సర్కార్ హయాంలో రైతులు, ప్రభుత్వ, కాంట్రాక్ట్ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. మరోవైపు రేవంత్ సర్కార్ లో విద్యార్థులకూ కష్టాలు తప్పడం లేదు. స్కాలర్ షిప్స్ విడుదల చేయాలంటూ విద్యార్థులంతా కదం తొక్కారు..ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని విద్యార్థినులు ఎల్బీ స్టేడియం వద్ద నిరసన ర్యాలీ చేపట్టారు. ఇదేం రాజ్యం ఇదేం రాజ్యం.. ప్రభుత్వం తక్షణేమ స్కాలర్ షిప్ వెంటనే రిలీజ్ చేయాలి..అంటూ నినాదాలు చేశారు, విద్యార్థినులంతా పెద్ద సంఖ్యలో ర్యాలీగా బయలు దేరడంతో ఎల్బీ స్టేడియం పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి.

డిసెంబర్ 20 నుంచి 29 వరకు 8.34 లక్షల

మందికి వైకుంఠ ద్వార దర్శనం

- సామాన్య భక్తులకు 92 శాతం ప్రాధాన్యత
- రూ.2,750 కోట్లతో యాత్రికుల టౌన్‌షిప్
- నిర్మాణానికి డీపీఆర్, డిజైన్లు
- టీటీడీ ఉద్యోగులకు బ్రహ్మోత్సవ కానుక..
- స్విమ్స్‌కు అదనంగా రూ.41.23 కోట్ల గ్రాంటు

తిరుమల, నవంబర్ 18:

తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 20 నుంచి 29వ తేదీ వరకు పది రోజుల పాటు 8.34 లక్షల మంది భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ సాధికారిక మండలి ఛైర్మన్ ముద్దాడ రవిచంద్ర వెల్లడించారు. సామాన్య భక్తులకు 92 శాతం ప్రాధాన్యత కల్పించనున్నట్లు తెలిపారు. బుధవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో నిర్వహించిన టీటీడీ సాధికారిక మండలి సమావేశం అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో సామాన్య భక్తులకు దర్శనం కల్పించేందుకు ఆన్‌లైన్‌లో ఎస్ఎస్‌డీ టోకెన్లు విడుదల చేస్తామని చెప్పారు. తొలి రెండు రోజులు సర్వదర్శనం ఉండదని, అనంతరం ఎనిమిది రోజుల పాటు సర్వదర్శనం అమలు చేస్తామని వివరించారు.అలిపిరి--ఎస్వీ జూ పార్కు రహదారికి సమీపంలోని టీటీడీ స్థలంలో శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ.2,750 కోట్లతో యాత్రికుల టౌన్‌షిప్ నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి డీపీఆర్, డిజైన్ల తయారీ, ప్రాజెక్టు పర్యవేక్షణ కోసం కన్సల్టెన్సీ సంస్థను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ఈ టౌన్‌షిప్‌లో భక్తులకు మెరుగైన వసతి, ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల అనంతరం ఉద్యోగ లకు అందించే కానుకను ఈ ఏడాది పర్మినెంట్ ఉద్యోగులకు రూ.16,940, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రూ.8,289 చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉద్యోగుల ఇంటి స్థలాల కేటాయింపులో భాగంగా 2007 సీనియా రిటీ జాబితా ఆధారంగా ఫేజ్-3లో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి వారసులకు పల్లం గ్రామంలో ప్లాట్లు కేటాయించేం దుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. మిగిలిన అర్హుల పరిశీలనకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నారు.పాదిరేడులో ఇంటి స్థలాల అభివృద్ధికి సంబంధించి టీటీడీ 65 శాతం, ఉద్యోగులు, కేటాయింపుదారుల 35 శాతం వాటాలతో ఇప్పటికే కేటా యించిన రూ.230 కోట్లకు ధ్రువీకరణ ఇచ్చినట్లు వెల్లడించారు. తిరుమలలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు 321 మంది పారిశుద్ధ్య కార్మికులు, 27 మంది సూపర్‌వైజర్లు కలిపి మొత్తం 348 మందిని పొరుగు సేవల కింద నియమించేందుకు ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. తిరుమలను నెట్‌జీరో, కార్బన్ న్యూట్రల్ ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక పర్యావరణ పరిరక్షణ విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ విభాగానికి రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ టి.వి. సత్యనారాయణను ఏడాది పాటు నియమించనున్నారు.శ్రీవారి నిత్య కైంకర్యాలకు అవసరమైన రోజుకు 2,000 లీటర్ల పాలు, 80 కిలోల నెయ్యిని సొంతంగా సమకూర్చుకునేందుకు 500 దేశీయ జాతి గోవుల కొనుగోలు, రవాణా కోసం రూ.7.50 కోట్లు మంజూరు చేశారు. తిరుమల--తిరుపతి అటవీ ప్రాంతాల్లో మానవ--వన్యప్రాణుల సంఘర్షణలను నివారించడం, భక్తుల భద్రత, వన్యప్రాణుల సంరక్షణ కోసం 2026--2028 రెండేళ్ల కాలానికి ఏపీ అటవీ శాఖకు రూ.16.40 కోట్ల ఆర్థిక సహాయం అందించేందుకు ఆమోదం తెలిపారు. శ్రీనివాస మంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి శ్రీవారిమెట్టు వరకు రహదారి అభివృద్ధి, ఇరువైపులా ఇంటర్‌లాకింగ్ సిమెంట్ బ్లాక్‌ల నిర్మాణానికి రూ.9.50 కోట్లు మంజూరు చేశారు. స్విమ్స్ ఆసుపత్రిలో పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పెండింగ్ బకాయిల చెల్లింపుల కోసం అదనంగా రూ.41.23 కోట్ల ప్రత్యేక గ్రాంటు మంజూరుకు ఆమోదం తెలిపారు. ఎస్వీ ఆయుర్వేద కళాశాలలో బీఏఎంఎస్ యూజీ కోర్సు సీట్లను 40 నుంచి 60కి పెంచేందుకు నిర్ణయించారు.తిరుపతిలోని అలిపిరి సమీపంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర సంప్రదాయ శిల్పకళా, వాస్తుశిల్ప సంస్థలో రూ.23 కోట్లతో 41,167 చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన హాస్టల్ భవనం నిర్మించనున్నారు. దీనివల్ల 229 మంది విద్యార్థులకు వసతి సౌకర్యం అందుబాటులోకి రానుంది. టీటీడీ అగరుబత్తి యూనిట్‌లో తయారీ, ప్యాకేజింగ్, సరఫరా కోసం బెంగళూరుకు చెందిన మెస్సర్స్ పాటిల్ పరిమళ వర్క్స్ లిమిటెడ్‌కు మూడేళ్ల కాలానికి జీఎస్టీతో కలిపి సుమారు రూ.90 కోట్ల అంచనా వ్యయంతో ఎల్-1 టెండర్‌ను ఆమోదించారు. శ్రీవారి ఆలయంలో నాలాయిర దివ్య ప్రబంధ పారాయణ సేవలు నిర్వహిస్తున్న పారాయణదారుల సంభావన పెంచాలని కూడా నిర్ణయించారు.తిరుచానూరు గోశాలలో విధి నిర్వహణలో ఏనుగు దాడికి గురై మరణించిన ఈఎంటీఎస్ ఉద్యోగి ఎస్. చంద్రశేఖర్ కుటుంబానికి రూ.15 లక్షలు, ఇటీవల మరణించిన మరో ఇద్దరు టీటీడీ ఉద్యోగులు కె. చక్రవర్తి, ఎస్. చంద్రశేఖర్ కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున అందించిన ఆర్థిక సాయానికి ఆమోదం తెలిపారు. భవిష్యత్తులో అర్హులైన ఉద్యోగుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల ఆర్థిక ప్రయోజనం అందేలా గ్రాట్యుటీ, బీమా, ఎక్స్‌గ్రేషియాతో సమగ్ర సంక్షేమ విధానం అమలు చేయాలని నిర్ణయించారు. అలిపిరి నడకమార్గంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి మోకాళ్లమిట్ట వరకు భక్తుల సౌకర్యార్థం ఐఐటీ నిపుణుల సహకారంతో కేబుల్ బ్రిడ్జి నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు ఛైర్మన్ తెలిపారు. ఎస్వీ విద్యాదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి ఐఐటీలో ఒకటి, అలిపిరిలోని సంప్రదాయ శిల్పకళాశాల ప్రాంగణంలో మరొకటి చొప్పున రెండు నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణ అందించి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచడమే లక్ష్యమన్నారు.ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కార్యదర్శి కె. కన్నబాబు, ఆర్థిక శాఖ కార్యదర్శి వి. వినయ్‌చంద్, టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవోలు డాక్టర్ ఏ. శరత్, ప్రభల గోపినాథ్, సీవీఎస్‌వో మురళీకృష్ణ, చీఫ్ ఇంజినీర్ మనోహరం తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగానికి తెలంగాణలో అపార అవకాశాలు



- హైదరాబాద్‌ను అంతర్జాతీయ క్రియేటివ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం: మంత్రి జూపల్లి
- ఇండియా జాయ్-2026, ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌తో పెట్టుబడులు, భాగస్వామ్యాలకు ప్రోత్సాహం

హైదరాబాద్, నవంబర్ 18 :

యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ (ఏవీజీసీ-ఎక్స్ఆర్) రంగాల్లో తెలంగాణకు అపార అవకాశాలు ఉన్నాయని, హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి క్రియేటివ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ రంగాల ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బుధవారం హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో పరిశ్రమ ప్రముఖులతో నిర్వహించిన ఏవీజీసీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాల సాధనలో ఏవీజీసీ-ఎక్స్ఆర్, పర్యాటక రంగాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. 2034 నాటికి లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. తెలుగు సినిమా ఇప్పటికే దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, డిజైన్, ఆధునిక సృజనాత్మక సాంకేతిక రంగాల్లోనూ హైదరాబాద్‌కు మంచి ప్రతిభ, అనుభవం ఉన్నాయని మంత్రి చెప్పారు. ఈ సామర్థ్యాలను మరింత విస్తరించి, యువత తమ సృజనాత్మక ఆలోచనలను ఆచరణలో పెట్టేందుకు, సొంతంగా ప్రాజెక్టులు రూపొందించేందుకు రాష్ట్రంలోనే మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.డిసెంబర్ 7 నుంచి 13 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో ఇండియా జాయ్-2026 నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరిగే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా ఈ కార్యక్రమం జరగనుందని తెలిపారు. సృజనాత్మక పరిశ్రమలు, సాంకేతిక సంస్థలు, పెట్టుబడి దారులు, యువ ప్రతిభావంతులకు ఈ రెండు కార్యక్రమాలు ఉమ్మడి వేదికగా నిలుస్తాయన్నారు.రాష్ట్రంలోని ఆరు ప్రత్యేక పర్యాటక సర్క్యూట్లైన ఆధ్యాత్మిక, వారసత్వ, ఎకో-వెల్‌నెస్, హస్తకళలు, జల పర్యాటక, బౌద్ధ పర్యాటక ప్రాంతాల అభివృద్ధిలో ఏవీజీసీ, ఎక్స్ఆర్ సంస్థలు భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), వర్చువల్ రియాలిటీ (వీఆర్) సాంకేతికతల ద్వారా తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని సరికొత్త అనుభూతులతో ప్రపంచానికి పరిచయం చేయవచ్చని అన్నారు.ఏడు రోజులపాటు జరిగే ఇండియా జాయ్-2026కు 80 వేల మందికి పైగా బీ2సీ సందర్శకులు, 8,500 మందికి పైగా బీ2బీ ప్రతినిధులు, 20కి పైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, సినిమా, డిజిటల్ కంటెంట్, ఈ-స్పోర్ట్స్, డిజైన్, ఆధునిక సృజనాత్మక సాంకేతిక రంగాలకు ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని చెప్పారు. 'ఎడ్యుకేట్, ఎగ్జిబిట్, ఎక్స్‌పీరియన్స్, ఎంజాయ్' అనే నాలుగు ప్రధాన అంశాలతో విజ్ఞానం, ప్రతిభ ప్రదర్శన, సాంకేతిక అనుభవం, వినోదానికి అవకాశం కల్పించనున్నట్లు వివరించారు. ఇండియా జాయ్ విజయవంతం కావడంలో పరిశ్రమల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్న మంత్రి, స్టూడియోలు, కంపెనీలు తమ ప్రాజెక్టులు, సాంకేతికతలు, సృజనాత్మక పనితీరును ప్రదర్శించాలని కోరారు. పరిశ్రమల సంఘాలు తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోని తమ సభ్యులను భాగస్వాములను చేయాలని, దేశవిదేశాల నుంచి ప్రముఖ సంస్థలు, సృజనకారులు, నిపుణులను ఆహ్వానించాలని సూచించారు.విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, ఫిల్మ్ స్కూళ్లు, యానిమేషన్, గేమింగ్ సంస్థలు తమ విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ప్రోత్సహించాలని అన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడంతోపాటు పరిశ్రమ నిపుణులతో నేరుగా మాట్లాడి భవిష్యత్తు ఉపాధి అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.



కృత్రిమ మేధ (ఏఐ) కారణంగా సృజనాత్మక రంగాల్లో చోటుచేసుకుంటున్న మార్పులను ప్రస్తావిస్తూ, తెలంగాణ ఆర్థిక వ్యవస్థను వైవిధ్యభరితంగా, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ఏవీజీసీ-ఎక్స్ఆర్ రంగాన్ని వ్యూహాత్మక రంగంగా అభివృద్ధి చేయాలని మంత్రి పేర్కొన్నారు. ఇండియా జాయ్ విజయాన్ని కేవలం కార్యక్రమ నిర్వహణ, సందర్శకుల సంఖ్య ఆధారంగా అంచనా వేయరాదని, దాని ద్వారా ఏర్పడే కొత్త వ్యాపార అవకాశాలు, పెట్టుబడి చర్చలు, భాగస్వామ్యాలు, స్థానిక స్టూడియోలకు లభించే అవకాశాలే అసలైన ఫలితాలని స్పష్టం చేశారు. ప్రతి సంస్థ కనీసం ఒక కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని, ప్రాజెక్టుల ప్రదర్శన, ప్రత్యేక సెషన్లు, విద్యార్థి బృం దాల భాగస్వామ్యం, అంతర్జాతీయ అతిథుల ఆహ్వానం వంటి కార్యక్రమాలకు సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రపంచ స్థాయి భాగస్వామ్యాలు, పెట్టుబడులను ఆకర్షించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్థిరమైన విధానాలు, సృజనా త్మక ప్రతిభ తెలంగాణలో ఉన్నాయని మంత్రి తెలిపారు. ప్రభుత్వం, పరిశ్రమలు సమన్వయంతో పనిచేసి ఇండియా జాయ్-2026, ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లను అంతర్జాతీయ స్థాయిలో విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, గ్రీన్ గోల్డ్ యానిమేషన్ డైరెక్టర్ టోమాజ్ వాల్జాక్, సీఎంఓ భరత్ లక్ష్మీపతి, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ కవిత, రోటోమేకర్ సీఈఓ, టీవీఏజీఏ జనరల్ సెక్రటరీ, ఇండియా జాయ్ సహ వ్యవస్థాపకుడు మైక్ యాతం, పర్పుల్‌టాక్ సీటీఓ వంశీ, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్, ఎక్స్సీరియం చైర్మన్ రాందేవ్, ఇన్వెస్ట్ తెలంగాణ ఏవీజీసీ అండ్ ఆరెంజ్ ఎకానమీ డైరెక్టర్ వల్లభి ఏ. తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల అమలులో అర్హులకే ప్రాధాన్యం..



-ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా..
-బోయినపల్లి మండలంలో 567 మందికి చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

బలగం టీవీ,బోయినపల్లి:

ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి మండలం కొత్తపేట గ్రామంలో నిర్వహించిన చేయూత నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ముఖ్య అతిథులుగా హాజరై 567 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.ముందుగా జయ జయహే తెలంగాణ గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేయూత పెన్షన్ల ప్రాధాన్యతను పాటల రూపంలో వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ చేయూత పెన్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులను గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ చేయించి అర్హులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా పెన్షన్ నగదు జమ అవుతుందని అన్నారు . జిల్లావ్యాప్తంగా 8,209 మందికి, బోయినపల్లి మండలంలో 567 మందికి నూతన పెన్షన్ మంజూరు పత్రాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంకా అర్హులైన వారు ఉంటే ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో బోయినపల్లి మండలం జిల్లాలో ప్రథమ స్థానంలో ఉందని, త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పించనున్నామని,ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభిస్తారని అన్నారు . జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో నెల రోజులపాటు దరఖాస్తులు స్వీకరిస్తామని, రేషన్ కార్డు ఉన్నా లేకున్నా అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు . ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు అందించాలని సూచించారు. ఇందిరా మహిళా శక్తి చీరలను కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణీ చేస్తామని తెలిపారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు భరోసా: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా దాదాపు ఐదు లక్షల చేయూత పెన్షన్లను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంజూరు చేశారని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని పేర్కొన్నారు.రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేయడంతో పాటు కొత్త రేషన్ కార్డులు అందిస్తున్నామని, కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తున్నామని అన్నారు . మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రాష్ట్రంలో 25 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు.బోయినపల్లి మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని, రహదారులు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామని అన్నారు . రూ.12 కోట్లతో క్రీడా ప్రాంగణ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. చొప్పదండి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శరత్‌బాబు, తహసీల్దార్ షరీఫొద్దీన్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి

-17 తేమ శాతం ఉండేలా చూసుకోవాలి
-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తెలిపారు. ధాన్యం సేకరణ కోసం జిల్లాలో ఇప్పటివరకు ఐకేపీ ఆధ్వర్యంలో 113, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 108, మెప్మా ఆధ్వర్యంలో 6 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. ధాన్యం సేకరణ కోసం ఇప్పటికే 26 రైస్ మిల్లులు, ప్రభుత్వ ప్రత్యామ్నాయ గోదాములు సిద్ధంగా పెట్టామని అన్నారు . రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం శుభ్రం చేసి.. 17 శాతం తేమ ఉండేలా చూసుకోవాలని సూచించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పిలుపు నిచ్చారు.

ఇసుక వాహనాన్ని ఆపబోతే.. కానిస్టేబుల్‌పైకి దూసుకెళ్లింది..

-పికప్ వాహనంతో కానిస్టేబుల్‌ను ఢీకొట్టిన డ్రైవర్.
-తీవ్ర గాయాలు.. హైదరాబాద్‌కు తరలింపు



బలగం టీవీ,గంభీరావుపేట:

అక్రమ ఇసుక రవాణాను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై ఇసుక పికప్ వాహనంతో దాడికి పాల్పడిన ఘటన గంభీరావుపేట మండలం లింగన్నపేటలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో పోలీస్ కానిస్టేబుల్ ఆకుల రమేష్ తీవ్రంగా గాయపడ్డగా,మెరుగైన వైద్యం కోసం ఆయనను హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి 12.35 గంటల సమయంలో గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన హోంగార్డు మహిపాల్, కానిస్టేబుల్ ఆకుల రమేష్ బ్లూకోట్ విధుల్లో భాగంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న అశోక్ లేలాండ్ పికప్ వాహనం ఎల్లారెడ్డిపేట పోలీసుల ఆపే ప్రయత్నాలను లెక్కచేయకుండా లింగన్నపేట వైపు వస్తున్నట్లు సమాచారం అందడంతో లింగన్నపేట గ్రామంలోని హైస్కూల్ సమీపంలో వాహనాన్ని అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు.అదే సమయంలో అక్కడికి చేరుకున్న పికప్ వాహనాన్ని పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా, ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు డ్రైవర్‌ను పోలీసులపైకి వాహనాన్ని నడపాలని ప్రేరేపించడంతో,దీంతో డ్రైవర్ వేగంగా వాహనాన్ని పోలీసులపైకి నడపడంతో హోంగార్డు మహిపాల్ పక్కకు తప్పించుకున్నారు. కానిస్టేబుల్ రమేష్‌ను పికప్ వాహనం బలంగా ఢీకొట్టి అతనిపై నుంచి వెళ్లడంతో కుడిచేయి, కుడికాలికి తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే స్పందించిన పోలీసులు 108 అంబులెన్స్ ద్వారా రమేష్‌ను అశ్విని ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనలో పికప్ వాహన డ్రైవర్ ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు చెందిన సూర లక్ష్మణ్, వాహన యజమాని గొల్లపల్లికి చెందిన వేముల విజయ్, అదే గ్రామానికి చెందిన ఆలకుంట మధుల ప్రమేయం ఉన్నట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నడం తో ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆర్. బాలరాజు తెలిపారు.విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దాడి చేయడం, వారి విధులకు ఆటంకం కలిగించడం తీవ్రమైన నేరమని,అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారితో పాటు, ఇలాంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఆర్. బాలరాజు హెచ్చరించారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించాలి..



-పెన్షన్ రాని వారి దరఖాస్తులను పునఃపరిశీలించాలి
-మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని స్థానిక సినారె కళామందిరంలో సిరిసిల్ల పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ.. సిరిసిల్ల పట్టణంలో చేయూత పెన్షన్ల కోసం మొత్తం 2,276 మంది దరఖాస్తు చేసుకోగా, 1,668 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించి మంజూరు పత్రాలు అందించడం జరుగుతోందన్నారు. మిగిలిన 608 మందిని ఏ ప్రాతిపదికన అనర్హులుగా ప్రకటించారో పూర్తి వివరాలను అధికారులు మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు అందించాలని కోరారు. పెన్షన్ రాలేదని ఆందోళన చెందుతున్న దరఖాస్తుదారులకు సరైన సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.పెన్షన్ పొందేందుకు అర్హత ఉన్నప్పటికీ మంజూరు కాని వారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన వారందరికీ న్యాయం చేయాలని అధికారులను కోరారు. అదేవిధంగా వృద్ధాప్య పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన వృద్ధులకు కూడా ప్రభుత్వం వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న చేయూత పెన్షన్లు రూ.2,016, దివ్యాంగుల పెన్షన్లు రూ.4,016 గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పెంచిన మొత్తాలేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చేయూత పెన్షన్‌ను రూ.4 వేలకు, దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచి అందించాలని కోరారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అనంతరం లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, డీఆర్డీఏ జిల్లా అధికారి, మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా, వైస్ చైర్మన్ దార్ల సందీప్, వివ్ బుర్ర మల్లికార్జున్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కేటీఆర్ కంచుకోటలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం...



కేటీఆర్ భావిస్తున్న సిరిసిల్ల కంచుకోట.. ఇప్పుడు మంచుకోట
-కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

బలగం టీవీ,గంభీరావుపేట:

కేటీఆర్ తనకు సిరిసిల్ల కంచుకోట అని భావిస్తున్నారని, కానీ ప్రస్తుతం అది మంచుకోటగా మారిందని,బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో ప్రజాధనాన్ని దోచుకుని దాచుకున్నారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి, కోళ్లమద్ది, లింగన్నపేట గ్రామాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కేకే మహేందర్‌రెడ్డి అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు లక్ష్యంగా విద్యార్థులు ప్రాణత్యాగాలు చేశారని, వారి ఆశయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం లక్షలాది ఉద్యోగ నియామకాలు చేపట్టిందని అన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తూ, వివిధ వ్యాపారాల్లో ప్రోత్సాహం కల్పిస్తూ కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు హాస్టల్ చార్జీలు పెంచామని పేర్కొన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రకటించనుందని అన్నారు .గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేటీఆర్ తన అనుచరులకు సిరిసిల్ల జిల్లాలో సుమారు తొమ్మిది వేల ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా అప్పగించారని మహేందర్‌రెడ్డి ఆరోపించారు. సిరిసిల్లకు కేటీఆర్ చేసిన అభివృద్ధి ఇదేనా అని ప్రశ్నించారు. కేటీఆర్ ఎన్ని యాత్రలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. తొమ్మిదో ప్యాకేజీ పనులను నిర్లక్ష్యం చేశారని, డ్రగ్స్, ఇసుక, వస్త్ర మాఫియాలను ప్రోత్సహించారని ఆరోపించారు.

సిరిసిల్ల బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేటీఆర్ కుటుంబానికి సంబంధించిన అంశాలను ప్రస్తావించారని, జన్వాడ, ఎర్రవల్లి, రంగనాయకసాగర్, హిమాయత్‌సాగర్, దక్కన్ సరాయు ఫ్లైస్టార్ హోటళ్ల వ్యవహారాలు ఇందుకు ఉదాహరణలని అన్నారు . సిద్దిపేటలో గురువారం జరగనున్న సీఎం రేవంత్‌రెడ్డి సభలో హరీశ్‌రావుకు సంబంధించిన అంశాలు వెలుగులోకి రానున్నాయని పేర్కొంటూ, ఈ ప్రాంతం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ వెంట నడుస్తారా, లేక ఈ ప్రాంత అభివృద్ధి కోసం కాంగ్రెస్‌తో కలిసి వస్తారా అనేది తేల్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హామీద్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పర్శ హన్మాండ్లు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటి, నాయకులు మేడ భాస్కర్, అజ్మీరా భాస్కర్‌నాయక్, గోపాల్‌రెడ్డి, గంగి స్వామి, ఎలుక రాజు, శ్రీనివాస్‌రెడ్డి, రాయనర్సు, ఒరగంటి నర్సింలు, నుశ్రత్, రాజారాంరెడ్డి, కిషన్, రాజం, అంజగౌడ్, రవి, రాజు, లక్ష్మణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగుకు నీరివ్వాలి.. రైతులకు భరోసా కల్పించాలి..



- లేదంటే కరువు మండలంగా ప్రకటించాలి

బలగం టీవీ,గంభీరావుపేట:

రబీ పంటల సాగు కోసం ఎగువ మానేరు జలాశయం నుంచి, నీటి నిల్వలు ఉన్న చెరువుల నుంచి తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని, లేనిపక్షంలో గంభీరావుపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులకు కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గంభీరావుపేట మండల కేంద్రంలో బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు.అనంతరం తహసీల్దార్ కి

వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో ఎగువ మానేరు జలాశయంలో, కొన్ని చెరువుల్లో నీటి నిల్వలు ఉన్నప్పటికీ రబీ సాగుకు నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, చెరువులు, కుంటల్లో ఆశించిన స్థాయిలో నీరు లేకపోవడంతో రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఎగువ మానేరు నుంచి, నీటి నిల్వలు ఉన్న చెరువుల నుంచి వెంటనే సాగునీటిని విడుదల చేయాలని కోరారు.సాగునీరు విడుదల చేయడం సాధ్యం కాని పక్షంలో గంభీరావుపేట మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంటలు సాగు చేయలేని రైతులకు పంట నష్టపరిహారం, పెట్టుబడి రాయితీ, కరువు సహాయక నిధులు అందించాలని కోరారు. పంట రుణాల చెల్లింపులకు గడువు పొడిగించడంతో పాటు రైతులకు అవసరమైన వెసులుబాటు కల్పించాలని అన్నారు.మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ పరిస్థితులు, చెరువుల్లో నీటి నిల్వలు, సాగునీటి అవసరాలపై ప్రత్యేక అధికారుల బృందంతో క్షేత్రస్థాయి పరిశీలన జరిపి సమగ్ర సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులకు సాగునీరు అందకపోతే తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్, విష్ణోష్ గౌడ్, బండ దేవయ్య, సర్వోత్తమ్, నర్సింలు, గణేష్ రెడ్డి, దుర్గేష్ యాదవ్, గంట అశోక్, ఆంజనేయులు, దేవేందర్ యాదవ్, తిరుపతి, శ్రీనివాస్, చంద్రం యాదవ్, ప్రభాకర్, సుదర్శన్, సంజీవరెడ్డి, శంకర్, నవీన్ తదితరులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత..

బలగం టివి, ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన గుండం కౌసల్య కుమార్తె వివాహం సందర్భంగా నిరుపేద కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.5,000 ఆర్థిక సాయం జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎల్లారెడ్డిపేట ఫ్యాక్స్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తూ సామాజిక సేవలో ముందుంటున్న గుండారపు కృష్ణారెడ్డి ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో రేసు జగన్, గాదం రామదాసు, గుంటుక రామరాజం, మంగరపు రాజు, లింగాల శ్రీనివాస్, లింగాల రాజయ్య, లింగాల చంద్రం, కొప్పెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలి..

-అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్ళు చేపట్టాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల, అంకుసాపూర్ గ్రామాల్లో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను, ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్ళు చేపట్టాలని, నిర్దేశించిన తేమ శాతం వచ్చిన తర్వాతే తూకం వేయాలని అన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను రిజిస్టర్లలో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు.

భూముల రీ సర్వే ప్రక్రియ పరిశీలన

తంగళ్ళపల్లి మండలం వేణుగోపాలపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియ పురోగతిని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ బుధవారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. గ్రామంలో ఇప్పటివరకు చేపట్టిన భూముల రీ సర్వేకు సంబంధించిన వివరాలను అధికారుల బృందాన్ని అడిగి తెలుసుకున్నారు. రైతుల సమక్షంలో భూముల రీ సర్వే ప్రక్రియ చేపట్టాలని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్లు మురళి, ఫారూఖ్, తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయంలో సమయపాలన కరువు..

-10.15 గంటలైనా తెరుచుకోని ఎంపీడీవో కార్యాలయం

-ఎల్లారెడ్డిపేటలో అధికారుల ఆలస్యంపై విమర్శలు.. -సమయపాలనపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట:

ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన పాటించాల్సిన అధికారులు, సిబ్బందే విధులకు ఆలస్యంగా హాజరవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కనిపించిన పరిస్థితి ఇందుకు నిదర్శనంగా నిలిచింది.బుధవారం ఉదయం 10.15 గంటల సమయంలో కార్యాలయానికి వెళ్లగా తాళం వేసి ఉంది. 10.30 గంటల సమయంలో ఇద్దరు సిబ్బంది మాత్రమే కార్యాలయానికి చేరుకోగా, ఎంపీడీవో సత్తయ్య 10.45 గంటలకు విధులకు హాజరయ్యారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత సమయానికి





విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు, సిబ్బంది ఇలా ఆలస్యంగా రావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంపీడీవో కార్యాలయానికి వస్తుంటారు. గ్రామాల అభివృద్ధి పనులు, ఉపాధి హామీ, పంచాయతీరాజ్ సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన పనుల కోసం అధికారులను కలవాల్సి ఉంటుంది. అయితే కార్యాలయ సమయానికి అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలు నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వం పదేపదే ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో సమయపాలన లోపిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విధులకు ఆలస్యంగా హాజరవుతున్న అధికారుల తీరుపై ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.





తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటేలా దీక్షా దివస్...

-నాప్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

బలగం టీవీ,గంభీరావుపేట:

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక ఘట్టమైన దీక్షా దివస్‌ను తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటేలా ఈ నెల 29న అలుగునూరు చౌరస్తాలో నిర్వహించనున్నట్లు నాప్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు తెలిపారు. గంభీరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాప్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు మాట్లాడుతూ 2009 నవంబర్ 29న తెలంగాణ సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో ఉద్యమం రాష్ట్రవ్యాప్త ప్రజా ఉద్యమంగా రూపాంతరం చెందిందన్నారు. ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ వర్గాల ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో ఆ దీక్ష కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణను అభివృద్ధి పథంలో దేశంలోనే అగ్రస్థానానికి తీసుకెళ్లారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ మూడేళ్ల పాలనలో వ్యవసాయంతో పాటు వివిధ రంగాలు దెబ్బతిన్నాయని అన్నారు . ప్రజా సమస్యలను మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లి తెలంగాణ భవిష్యత్తుపై చర్చించేందుకు దీక్షా దివస్‌ను వేదికగా చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

నవంబర్ 29న నిర్వహించే దీక్షా దివస్ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు . ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేసీఆర్ నాయకత్వాన్ని మరోసారి కోరుకుంటున్నారని పేర్కొన్నారు. పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం దీక్షా దివస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి గౌడ్, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు,మాజీ మార్కెట్ చైర్మన్ బాలవ్వ, నాయకులు గంధ్యాడపు రాజు, కొమిరిశెట్టి లక్ష్మణ్, అంజిరెడ్డి, పెద్దవేని వెంకట్ యాదవ్, లింగం యాదవ్, కమ్మరి రాజారాం, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో

పురాతన ఆలయ వైభవాన్ని దెబ్బతీయొద్దు..

- మాస్టర్ ప్లాన్, డీపీఆర్, నిధుల వివరాలు బహిర్గతం చేయాలి..

-బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

బలగం టీవీ,వేములవాడ:

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ప్రధాన ఆలయ

అభివృద్ధి పేరుతో ఆలయ చారిత్రక వైభవాన్ని దెబ్బతీయవద్దని, ప్రధాన ఆలయాన్ని ముట్టుకోబోమని గతంలో ప్రకటించిన అధికారులు ఇప్పుడు గోపురాన్ని ఎందుకు కూల్చివేశారో సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావుడిమాండ్ చేశారు. వేములవాడ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సమావేశాల్లో ప్రధాన ఆలయాన్ని ముట్టుకోకుండా పరిసర ప్రాంతాల్లో మాత్రమే అభివృద్ధి పనులు చేపడతామని ప్రకటించారని,రాజరాజేశ్వర స్వామి ఆలయం కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యేకు వ్యక్తిగత ఆస్తి కాదని, శతాబ్దాల చరిత్ర కలిగిన భక్తుల ఆరాధ్య దైవమని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి విషయంలో స్పష్టమైన మాస్టర్ ప్లాన్ లేకుండా పనులు చేపట్టడం సరికాదన్నారు.భక్తుల సౌకర్యాల కోసం అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెబుతున్నప్పటికీ, క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండే భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, ప్రసాదాల పంపిణీ వంటి సదుపాయాలు కల్పించడంపై దృష్టి సారించాలని సూచించారు. తిరుమల, యాదాద్రి తరహాలో క్యూలైన్ కంపార్ట్‌మెంట్లలో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు.ఆలయ అభివృద్ధికి సంబంధించిన సమగ్ర మాస్టర్ ప్లాన్, డీపీఆర్, గోపురాల ఎత్తు, నిర్మాణాల స్థానం, పనుల కాలపరిమితిని ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. నాగిరెడ్డి మండపం, అద్దాల మండపం, కోటిలింగాల వంటి పురాతన కట్టడాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పాత రాళ్లను సంఖ్యలతో గుర్తించి యథాతథంగా పునర్నిర్మిస్తామని చెప్పిన అధికారులు, ఆ పనుల పురోగతిని వెల్లడించాలని కోరారు.

2025 నవంబర్ 12 నుంచి ప్రధాన ఆలయంలో దర్శనాలు నిలిచిపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో ఆగస్టులో పునఃదర్శనం కల్పిస్తామని ప్రకటించినా అమలు కాలేదని, పనులు 30, 40, 50 శాతం పూర్తయ్యాయని చెబుతున్న అధికారులు, ఆ పురోగతి ఏ పనులకు



సంబంధించిందో వివరించాలని అన్నారు.

రెండో దశ అభివృద్ధికి ప్రకటించిన రూ.99.40 కోట్లలో ఇప్పటివరకు సుమారు రూ.19 కోట్లు మాత్రమే విడుదలైనట్లు తమకు సమాచారం ఉందని పేర్కొన్నారు. రూ.250 కోట్ల అభివృద్ధి ప్రణాళికలో గత బడ్జెట్లలో కేటాయించిన రూ.50 కోట్లు, 2026 బడ్జెట్‌లో ప్రకటించిన రూ.100 కోట్ల నిధుల విడుదల, వినియోగ వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

ఆలయ అభివృద్ధి పనుల వివరాలను మీడియా, భక్తులు, ప్రతిపక్ష నాయకులకు తెలియకుండా కంచెల మధ్య పరిమితం చేయడం ఎందుకని ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన ప్రజెంటేషన్‌లో ప్రధానాలయ గోపురం కూల్చివేత అంశం ఉందా,ప్రస్తుతం ఉన్న రాజగోపురాన్ని కూడా తొలగించే ప్రతిపాదన ఉందా? అన్న విషయాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలన్నారు.ఇప్పటికైనా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవస్థాన అధికారులు సమగ్ర మాస్టర్ ప్లాన్, డీపీఆర్, నిధుల వివరాలు, పనుల పురోగతి, పునఃదర్శనం తేదీపై బహిరంగ ప్రకటన చేయాలని చల్మెడ లక్ష్మీనరసింహారావు డిమాండ్ చేశారు. ఆలయ పురాతన వైభవాన్ని, భక్తుల మనోభావాలను కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు.

పిఆర్‌సిని వెంటనే అమలు చేయాలి..



-డిటిఎఫ్ ఇల్లంతకుంట మండల శాఖ అధ్యక్షులు నరేందర్ రెడ్డి

బలగం టీవీ, ఇల్లంతకుంట:

పి ఆర్ సి రిపోర్టు తెప్పించుకొని వెంటనే అమలు చేయాలని, సిపిఎస్ ని రద్దు చేయాలని, జీవో 25ని సవరించాలని తదితర ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డీటీఫ్ ఇల్లంతకుంట మండల శాఖ అధ్యక్షులు తూముకుంట. నరేందర్ రెడ్డి డిమాండ్ చేసారు. ఈరోజు మండలంలోని అన్ని పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు చేయించడం జరిగింది.

ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో సంఘ బాధ్యులు మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా పిఆర్సి పెండింగ్లో ఉందని వెంటనే అమలు చేయాలని, ఇంకా పెండింగ్లో ఉన్న నాలుగు విడుతల డిఏలు విడుదల చేయాలని, EHS లో లోపాలను సవరించి పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని, జీవో నెంబర్ 25 ను సవరించాలని, ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయున్ని కేటాయించి, ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని, CPS వెంటనే రద్దుచేసి ఓపీఎస్ ను అమలు చేయాలని, 190 జీవో అమలు చేయాలని కేజీబీవీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో తెలిపిన విధంగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు అన్నింటిని పరిష్కరించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు టి.నరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్, పూర్వ జిల్లా అధ్యక్షులు రాష్ట్ర కౌన్సిలర్లు రాజేశ్వరరావు, శ్రీహరి, రామేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి, సీనియర్ బాధ్యులు కే. రామకృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, స్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధిపై చర్చ..

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్‌తో సిరిసిల్ల మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం భేటీ..

- రైతులకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడి..

బలగం టీవీ, సిరిసిల్ల:

సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన సత్తు శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్, పాలకవర్గ సభ్యులు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను, రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నియామకం అనంతరం తొలిసారిగా ఇరువురు నేతలను కలిసిన పాలకవర్గ సభ్యులు సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై వారితో చర్చించారు.

మార్కెట్‌కు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని పాలకవర్గ సభ్యులు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని చైర్మన్ సత్తు శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్‌తో పాటు పాలకవర్గ సభ్యులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సిరిసిల్ల వ్యవసాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.



పెద్దూరు పాఠశాలలో ఘనంగా స్వయంపాలన దినోత్సవం..

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దూరు పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రలను పోషిస్తూ పాఠశాలలోని వివిధ తరగతులకు బోధన చేశారు. అలాగే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బాధ్యతలను విద్యార్థులు స్వయంగా నిర్వహించి తమ ప్రతిభను చాటుకున్నారు.

ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం, ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు ఉపాధ్యాయుల విధులు, బాధ్యతల పట్ల అవగాహన కలిగింది. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని స్వయంపాలన దినోత్సవాన్ని విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రవర్తుల రమాదేవి మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.

బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ వినూత్న కార్యక్రమం విద్యార్థుల్లో ఆనందోత్సాహాలను నింపింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమా, జనగాం రాజమల్లు, ఈరబోయిన రవికుమార్, భైరవాణి శ్రీ, కాడర్ల కల్పన, నాగుల వీణ,



నందాల శంకర్, గడ్డి మహేష్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడా లీగ్‌ల బలోపేతానికి కేంద్రం కీలక అడుగు

- ఐపీఎల్ సీఓఓ హేమాంగ్ అమీన్, ఐఓఏ సీఈఓ రఘురామ్ అయ్యర్‌లతో 14 మంది సభ్యుల ఉన్నత స్థాయి కమిటీ!
- కమిటీలో సభ్యుడిగా నియమితులైన హేమాంగ్ అమీన్. Source: BCCI
- దేశంలో వృత్తిపరంగా, ఆర్థికంగా నిలదొక్కుకునే క్రీడా లీగ్‌ల వ్యవస్థను (Sports League Ecosystem) రూపొందించేందుకు 14 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసిన కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ
- కమిటీలో బీసీసీఐ సీఈఓ, ఐపీఎల్ సీఓఓ హేమాంగ్ అమీన్, భారత ఒలింపిక్ సంఘం (IOA) సీఈఓ రఘురామ్ అయ్యర్‌తో పాటు ప్రముఖ బ్రాడ్‌కాస్టర్లు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు
- ఒలింపిక్ క్రీడలు, మహిళా, యువజన, దేశీయ క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ఎనిమిది వారాల్లోగా తమ సిఫార్సులను సమర్పించనున్న కమిటీ



బలగం టీవీ, న్యూఢిల్లీ:

దేశంలో ఐపీఎల్ (IPL) తరహాలో ఇతర క్రీడల్లోనూ వృత్తిపరమైన, ఆర్థికంగా సుస్థిరమైన క్రీడా లీగ్‌లను అభివృద్ధి చేసేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సమగ్ర మార్గదర్శకాలను (Framework) రూపొందించడానికి 14 మంది సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. ఈ కమిటీలో బీసీసీఐ సీఈఓ, ఐపీఎల్ సీఓఓ హేమాంగ్ అమీన్, భారత ఒలింపిక్ సంఘం (IOA) సీఈఓ రఘురామ్ అయ్యర్ వంటి ప్రముఖ క్రీడా నిర్వాహకులు సభ్యులుగా ఉన్నారు.

కమిటీ ప్రధాన లక్ష్యాలు & బాధ్యతలు:

దేశంలో పలు క్రీడా లీగ్‌లు ప్రారంభమైనప్పటికీ, ప్రారంభ దశలో వాణిజ్యపరమైన (Commercial viability) సవాళ్లను ఎదుర్కొంటున్నాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో కమిటీకి అప్పగించిన ప్రధాన బాధ్యతలు:

అవరోధాల గుర్తింపు: ప్రస్తుత క్రీడా లీగ్ వ్యవస్థను విశ్లేషించి, లీగ్‌ల ఏర్పాటు మరియు దీర్ఘకాలిక మనుగడకు అడ్డుపడుతున్న ప్రధాన సమస్యలను గుర్తించడం.

పెట్టుబడుల ఆకర్షణ: కార్పొరేట్ మూలధనం, ఫ్రాంచైజీ యాజమాన్యం, స్పాన్సర్‌షిప్‌లు, ప్రసార (Broadcasting) మరియు డిజిటల్ హక్కులు, అలాగే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) నిధులను ఆకర్షించేందుకు తగిన చర్యలను సిఫార్సు చేయడం.

ప్రాధాన్యతా క్రీడలు: ముఖ్యంగా ఒలింపిక్ క్రీడలు, మహిళా క్రీడలు, యువజన క్రీడలు, దేశీయ (Indigenous) క్రీడలు, మరియు వర్ధమాన క్రీడలను గుర్తించి, వాటి వాణిజ్య సామర్థ్యానికి అనుగుణంగా ప్రత్యేక నిర్వహణ నమూనాలను (Operational models) సూచించడం.

కమిటీలోని ప్రముఖ సభ్యులు & గడువు:

క్రీడా మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి (గవర్నెన్స్) కునాల్ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ కమిటీలో ఖేలో ఇండియా సంయుక్త కార్యదర్శి వినీల్ కృష్ణ సభ్యుడిగా ఉన్నారు. వీరితో పాటు జియోస్టార్ (JioStar), సోనీ పిక్చర్స్, దూరదర్శన్ (DD Sports), జీ ఎంటర్‌టైన్‌మెంట్ వంటి ప్రముఖ ప్రసార సంస్థల ప్రతినిధులు; రిలయన్స్ (RIL), జీఎంఆర్ (GMR), అదానీ స్పోర్ట్స్‌లైన్, జేఎస్‌డబ్ల్యూ (JSW) స్పోర్ట్స్ ప్రతినిధులు, క్రీడా న్యాయ నిపుణులు నందన్ కామత్ సభ్యులుగా నియమితులయ్యారు.

జాతీయ క్రీడా సమాఖ్యలు, ప్రస్తుత లీగ్ నిర్వాహకులు, ఇన్వెస్టర్లు, స్పోర్ట్స్ టెక్నాలజీ సంస్థలతో సంప్రదింపులు జరిపి ఎనిమిది వారాల్లోగా తమ తుది సిఫార్సులను మంత్రిత్వ శాఖకు సమర్పించాలని కమిటీకి గడువు విధించారు.



'తలా ఫరెవర్'

- వందలాది డ్రోన్లతో చెపాక్ ఆకాశంలో ధోనీకి ఘన వీడ్కోలు.. భావోద్వేగానికి గురైన క్రికెట్ లోకం!
- ఐపీఎల్ ఆటగాడిగా రిటైర్మెంట్ ప్రకటించిన ఎంఎస్ ధోనీకి చెపాక్ స్టేడియంలో స్పెషల్ డ్రోన్ షోతో అద్భుత నివాళి అర్పించిన సీఎస్‌కే యాజమాన్యం
- ఆకాశంలో ధోనీ ముఖచిత్రం, హెలికాప్టర్ షాట్, నంబర్ 7 జెర్సీ, 'తలా ఫరెవర్' అక్షరాలను ఆవిష్కరించిన వందలాది డ్రోన్లు
- "ఒకసారి కెప్టెన్ అయితే ఎప్పటికీ మా తలానే" అంటూ సురేశ్ రైనా ఎమోషనల్ పోస్ట్; ధోనీ సేవలను కొనియాడిన రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, యువ క్రికెటర్లు

బలగం టీవీ, చెన్నై:

ఐపీఎల్ ఆటగాడిగా తమ సుదీర్ఘ, విజయవంతమైన ప్రస్థానానికి తెరదించి, 2027 సీజన్ నుంచి చెన్నై సూపర్ కింగ్స్ (CSK) మెంటార్‌గా కొత్త బాధ్యతలు చేపట్టనున్న దిగ్గజ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి అభిమానులు, సహచర ఆటగాళ్లు, ఫ్రాంచైజీ యాజమాన్యం ఘనంగా వీడ్కోలు పలికాయి. ధోనీ రిటైర్మెంట్ ప్రకటనతో క్రికెట్ ప్రపంచం మొత్తం భావోద్వేగానికి గురైంది.

చెపాక్ ఆకాశంలో 'తలా ఫరెవర్' డ్రోన్ షో:

ధోనీకి అరుదైన రీతిలో నివాళి అర్పించేందుకు సీఎస్‌కే యాజమాన్యం చెన్నైలోని ఎంఏ చిదంబరం (చెపాక్) స్టేడియంలో ప్రత్యేక డ్రోన్ షో నిర్వహించింది.

వందలాది డ్రోన్లను ఉపయోగించి ఆకాశంలో ధోనీ ముఖచిత్రాన్ని, ఆయన ఐకానిక్ హెలికాప్టర్ షాట్, మెరుపువేగంతో చేసే స్టంపింగ్ దృశ్యాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు.

ధోనీ జెర్సీ నంబర్ 7తో పాటు అభిమానులు ప్రేమగా పిలుచుకునే 'తలా' (Thala), 'తలా ఫరెవర్' (Thala Forever) అక్షరాలను ఆకాశంలో ఆవిష్కరించగా ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

ప్రత్యర్థుల నుంచి శిష్యుల వరకు భావోద్వేగ పోస్టులు:

సురేశ్ రైనా: "కొన్ని బంధాలు క్రికెట్‌కు మించినవి. 7వ నంబర్ జెర్సీ ఇకపై మైదానంలో కనిపించకపోయినా చెపాక్ గుండె చప్పుడుగా ధోనీ ఎప్పటికీ ఉంటారు. బాధ్యత మారినా ఆయన స్థానం మారదు.. ఒకసారి కెప్టెన్ అయితే ఎప్పటికీ మా తలానే" అని ఇన్‌స్టాగ్రామ్‌లో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు.

రోహిత్ శర్మ & జస్‌ప్రీత్ బుమ్రా: అద్భుతమైన ఐపీఎల్ కెరీర్ పూర్తి చేసుకున్నందుకు రోహిత్ శర్మ అభినందనలు తెలుపగా, ధోనీ కెప్టెన్సీలోనే భారత జట్టులోకి అరంగేట్రం చేసిన బుమ్రా.. తన అభిమాన క్రికెటర్, ఆదర్శం ధోనీయేనని కృతజ్ఞతలు తెలిపారు.

యువ ఆటగాళ్ల నివాళి: చిన్నప్పుడు టీవీలో చూసిన హీరోతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం మర్చిపోలేని అనుభూతి అని శ్రీలంక పేసర్ మతీష పతిరణ పేర్కొనగా, రింకూ సింగ్, తిలక్ వర్మ, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ధోనీ నుంచి నేర్చుకున్న పాఠాలను, ఫొటోలను పంచుకున్నారు.

ఐపీఎల్‌లో ధోనీ సువర్ణ అధ్యాయం:

ట్రోఫీలు: 2008 నుంచి సీఎస్‌కేకు వెన్నెముకగా నిలిచిన ధోనీ, తన నాయకత్వంలో 5 ఐపీఎల్ టైటిళ్లు (2010, 2011, 2018, 2021, 2023), 2 ఛాంపియన్స్ లీగ్ టీ20 ట్రోఫీలు (2010, 2014) అందించారు. (నిషేధం ఉన్న 2016, 2017 సీజన్లలో రైజింగ్ పుణె సూపర్‌జెయింట్ తరపున ఆడారు).

గణాంకాలు: మొత్తం 278 ఐపీఎల్ మ్యాచ్‌లలో 38.30 సగటు, 137.45 స్ట్రైక్ రేట్‌తో 5,439 పరుగులు సాధించారు. ఇందులో 24 అర్ధశతకాలు, 264 సిక్సర్లు ఉన్నాయి. 2025లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్ ఆయనకు చివరి ఐపీఎల్ మ్యాచ్‌గా మిగిలిపోయింది.

డిసెంబర్ 16న గోవాలో జరగనున్న ఐపీఎల్ మినీ వేలంలో మెంటార్ హోదాలో ధోనీ పాల్గొని 2027 సీజన్ కోసం జట్టు కూర్పులో కీలక పాత్ర పోషించనున్నారు.

ర్యాంకింగ్స్‌లో 12 స్థానాలు ఎగబాకిన అర్ష్‌దీప్ సింగ్..

- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్
- అగ్రస్థానంలోనే శుభ్‌మన్ గిల్!
- న్యూజిలాండ్‌తో జరిగిన ఐదు వన్డేల సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 12 స్థానాలు ఎగబాకి, అక్షర్ పటేల్‌తో కలిసి సంయుక్తంగా 19వ స్థానానికి చేరిన అర్ష్‌దీప్ సింగ్
- బ్యాటింగ్ విభాగంలో 1, 3 స్థానాల్లో నిలకడగా కొనసాగుతున్న శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ; ఒక స్థానం కోల్పోయి 5వ ర్యాంక్‌కు చేరిన రోహిత్ శర్మ
- ఆస్ట్రేలియాపై శతకంతో 34 స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 13వ ర్యాంక్‌కు దూసుకెళ్లిన ఇంగ్లండ్ ఓపెనర్ టామ్ బాంటన్



బలగం టీవీ, దుబాయ్:

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ICC) తాజాగా ప్రకటించిన పురుషుల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ భారీగా పురోగతి సాధించాడు. న్యూజిలాండ్ గడ్డపై జరిగిన ఐదు వన్డేల సిరీస్‌లో ఆకట్టుకునే ప్రదర్శన చేసిన అర్ష్‌దీప్, బుధవారం విడుదలైన తాజా బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 12 స్థానాలు ఎగబాకి సహచర ఆటగాడు అక్షర్ పటేల్‌తో కలిసి సంయుక్తంగా 19వ స్థానానికి చేరుకున్నాడు.

బౌలింగ్ విభాగంలో భారత్ పరిస్థితి:

న్యూజిలాండ్ సిరీస్‌లో కేవలం ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడిన స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఎనిమిది స్థానాలు కోల్పోయి 15వ స్థానానికి పడిపోయాడు. ప్రస్తుతం ఐసీసీ వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్ టాప్-10 జాబితాలో ఒక్క భారత బౌలర్ కూడా లేకపోవడం గమనార్హం.

బ్యాటింగ్ ర్యాంకింగ్స్: అగ్రస్థానంలో గిల్.. 5వ స్థానానికి రోహిత్:

బ్యాటింగ్ విభాగంలో భారత స్టార్ ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు.

నేటి నుంచే సమరం..



- రికార్డు స్థాయిలో నాలుగో టైటిల్‌పై భారత్ గురి!
- మధ్యప్రదేశ్‌లోని భోపాల్ వేదికగా నేటి నుంచి ప్రారంభం కానున్న మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్;
- తొలి పోరులో మలేషియాతో తలపడనున్న డిఫెండింగ్ ఛాంపియన్ భారత్
- ఆసియా క్రీడల్లో 44 ఏళ్ల తర్వాత స్వర్ణం గెలిచిన జోరులో ఉన్న సలీమా టెటె సేన.. సొంతగడ్డపై హ్యాట్రిక్ ట్రోఫీలతో పాటు మొత్తం 4వ టైటిల్ సాధించి దక్షిణ కొరియాను అధిగమించేందుకు సిద్ధం
- భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా, మలేషియా, థాయ్‌లాండ్ జట్ల మధ్య రౌండ్-రాబిన్‌లీగ్‌పోటీలు;నవంబర్ 27న

సెమీఫైనల్స్, నవంబర్ 28న ఫైనల్

బలగం టీవీ, భోపాల్:

గత నెలలో జరిగిన ఆసియా క్రీడల్లో 44 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ స్వర్ణ పతకం కైవసం చేసుకున్న భారత మహిళల హాకీ జట్టు, ఇప్పుడు సొంతగడ్డపై మరో చారిత్రక విజయాన్ని నమోదు చేసేందుకు సిద్ధమైంది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని నాథు బర్త్‌దా ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా గురువారం (నవంబర్ 19) నుంచి మహిళల ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ 2026 ప్రారంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్, తన తొలి మ్యాచ్‌లో మలేషియాతో తలపడనుంది.

దక్షిణ కొరియాను దాటేందుకు సువర్ణావకాశం:

రికార్డు వేట: గతంలో రాంచీ (2023), రాజ్‌గిర్ (2024) వేదికల్లో వరుసగా టైటిళ్లు గెలిచిన భారత్, ఇప్పటివరకు మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచి దక్షిణ కొరియాతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది. ఇప్పుడు భోపాల్‌లోనూ విజేతగా నిలిస్తే హ్యాట్రిక్ టైటిళ్లతో పాటు, టోర్నీ చరిత్రలో 4 టైటిళ్లు గెలిచిన తొలి జట్టుగా భారత్ సరికొత్త చరిత్ర సృష్టించనుంది.

అద్భుత ఫామ్: చీఫ్ కోచ్ షోర్డ్ మారిజ్నే (Sjoerd Marijne) శిక్షణలో భారత జట్టు ఈ ఏడాది అద్భుత విజయాలు సాధించింది. హైదరాబాద్‌లో జరిగిన క్వాలిఫయర్స్ ద్వారా ప్రపంచకప్‌కు అర్హత సాధించడమే కాకుండా, ఆక్లాండ్‌లో FIH నేషన్స్ కప్ గెలిచి ప్రో లీగ్‌కు ప్రమోట్ అయింది. ఆ తర్వాత బెల్జియం ప్రపంచకప్‌లో 5వ స్థానం (1974 తర్వాత అత్యుత్తమ ప్రదర్శన), ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకంతో రెట్టించిన ఉత్సాహంతో ఉంది. ప్రాక్టీస్ మ్యాచ్‌లో జపాన్‌ను 4-1తో చిత్తు చేసి ప్రత్యర్థులకు గట్టి హెచ్చరిక పంపింది.

కోచ్, కెప్టెన్ ఏమన్నారంటే..

ఒలింపిక్స్ వంటి మెగా టోర్నీలను దృష్టిలో ఉంచుకుని, ఆటగాళ్లను వివిధ స్థానాల్లో (Positions) ఆడించి జట్టులో లోతును (Squad depth) పెంచేందుకు ఈ టోర్నీని వేదికగా చేసుకుంటామని కోచ్ మారిజ్నే తెలిపారు. మరోవైపు, ప్రత్యర్థుల గురించి ఆలోచించకుండా, తమ ఆటతీరు, కోచ్ వ్యూహాలను పక్కాగా అమలు చేయడంపైనే దృష్టి పెడతామని భారత కెప్టెన్ సలీమా టెటె స్పష్టం చేసింది.

భారత్ మ్యాచ్‌ల షెడ్యూల్ (రౌండ్-రాబిన్ లీగ్):

ఆరు జట్లు (భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా, మలేషియా, థాయ్‌లాండ్) పాల్గొంటున్న ఈ టోర్నీలో రౌండ్-రాబిన్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ముఖ్యంగా ఆసియా క్రీడల ఫైనల్లో భారత్ చేతిలో ఓడిన ప్రపంచ 4వ ర్యాంకర్ చైనా, మూడుసార్లు ఛాంపియన్ దక్షిణ కొరియా, రెండుసార్లు విజేత జపాన్ నుంచి భారత్‌కు గట్టి పోటీ ఎదురుకానుంది.

నవంబర్ 19 (గురువారం)
భారత్ vs మలేషియా
భోపాల్
నవంబర్ 21 (శనివారం)
భారత్ vs దక్షిణ కొరియా
భోపాల్
నవంబర్ 22 (ఆదివారం)
భారత్ vs థాయ్‌లాండ్
భోపాల్
నవంబర్ 24 (మంగళవారం)
భారత్ vs చైనా
భోపాల్
నవంబర్ 25 (బుధవారం)
భారత్ vs జపాన్
భోపాల్

లీగ్ దశ ముగిసిన తర్వాత పాయింట్ల పట్టికలో టాప్-4లో నిలిచిన జట్లు నవంబర్ 27న జరిగే సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

నవంబర్ 28న మూడో స్థానం కోసం ప్లేఆఫ్ (కాంస్య పతక పోరు) మరియు ప్రతిష్ఠాత్మక ఫైనల్ మ్యాచ్ జరగనున్నాయి.

రిక్‌టెల్టన్ శతకం, రబాడ ఆల్‌రౌండ్ మెరుపులు..

- విజయతీరంలో దక్షిణాఫ్రికా!
- తొలి టెస్టు నాలుగో రోజు ఆటలో దక్షిణాఫ్రికా సంపూర్ణ ఆధిపత్యం; ర్యాన్ రిక్‌టెల్టన్ (102) అద్భుత సెంచరీ, కగిసో రబాడ (72), కెప్టెన్ టెంబా బవుమా (68 నాటౌట్) అర్ధశతకాలతో తొలి ఇన్నింగ్స్‌లో 557 పరుగులకు ఆలౌట్ అయిన సఫారీ జట్టు

బలగం టీవీ, జోహన్నెస్‌బర్గ్:

బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు పట్టు బిగించింది. వాండరర్స్ స్టేడియం వేదికగా బుధవారం జరిగిన నాలుగో రోజు ఆటలో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సఫారీ ఆటగాళ్లు చెలరేగడంతో దక్షిణాఫ్రికా విజయానికి చేరువైంది. బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 400 పరుగులకు దీటుగా బదులిచ్చిన దక్షిణాఫ్రికా, లంచ్ సమయానికి 557 పరుగులకు ఆలౌటై 157 పరుగుల కీలక ఆధిక్యాన్ని సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్, వెలుతురు లేమితో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 100 పరుగులు చేసి పీకల్లోతు కష్టాల్లో పడింది.



రిక్‌టెల్టన్ శతకం.. రబాడ, బవుమా కీలక ఇన్నింగ్స్:

ఓవర్‌నైట్ స్కోరు 386/7తో నాలుగో రోజు ఆట ప్రారంభించిన దక్షిణాఫ్రికాకు ర్యాన్ రిక్‌టెల్టన్, కగిసో రబాడ అద్భుత భాగస్వామ్యంతో భారీ ఆధిక్యాన్ని అందించారు.

రిక్‌టెల్టన్ 4వ టెస్టు సెంచరీ: నిలకడగా ఆడిన రిక్‌టెల్టన్ 159 బంతుల్లో తన నాలుగో టెస్టు శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. మొత్తం 165 బంతులు ఎదుర్కొని 13 ఫోర్లతో 102 పరుగులు చేసిన అతడు మెహిదీ హసన్ మిరాజ్ బౌలింగ్‌లో స్టంపౌట్ అయ్యాడు.

రబాడ మెరుపులు: మరోవైపు పేసర్ కగిసో రబాడ (93 బంతుల్లో 72; 10 ఫోర్లు, 2 సిక్సర్లు) తన కెరీర్‌లో రెండో టెస్టు అర్ధశతకం సాధించాడు. వీరిద్దరూ కలిసి 8వ వికెట్‌కు 117 పరుగులు జోడించారు.

బవుమా పోరాటం: అంతకుముందు రోజు గాయంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన కెప్టెన్ టెంబా బవుమా తిరిగి క్రీజులోకి వచ్చి అసాధారణంతోనే 68 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. చివరి వికెట్‌కు డేన్ ప్యాటర్సన్ (29)తో కలిసి 45 పరుగులు జోడించాడు. లంచ్ సమయానికి హసన్ మహ్మద్ బౌలింగ్‌లో ప్యాటర్సన్ బౌల్డ్ అయినప్పటికీ అది నో-బాల్ కావడంతో ఆటను అరగంట పొడిగించారు. చివరకు ఎబాదత్ హొస్సేన్ బౌలింగ్‌లో ప్యాటర్సన్ అవుట్ కావడంతో సఫారీ ఇన్నింగ్స్ ముగిసింది. బంగ్లా బౌలర్లలో హసన్ మహ్మద్ 4 వికెట్లు తీయగా, తస్కిన్ అహ్మద్, మెహిదీ హసన్ మిరాజ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు.

రెండో ఇన్నింగ్స్‌లో తడబడిన బంగ్లాదేశ్:

157 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్‌ను సఫారీ బౌలర్లు కట్టడి చేశారు.

ఓపెనర్ తంజిద్ హసన్ (4), మోమినుల్ హక్ (0)లను మార్కో యాన్సెన్, కగిసో రబాడ త్వరగానే పెవిలియన్‌కు పంపారు.

ఆ తర్వాత కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో (11), మహ్ఫిజుల్ ఇస్లాం (22)లను స్పిన్నర్ సైమన్ హార్మర్ అవుట్ చేయగా, తౌహిద్ హృదయ్ (23)ని రబాడ వెనక్కి పంపాడు.

వెలుతురు మందగించడం, చిరుజల్లులు కురవడంతో నాలుగో రోజు ఆటను ముందుగానే నిలిపివేశారు. ప్రస్తుతం బంగ్లాదేశ్ 34.2 ఓవర్లలో 100/5 పరుగులతో ఇంకా 57 పరుగులు వెనుకబడి ఉంది. చివరి రోజైన గురువారం క్రీజులో ఉన్న సీనియర్ బ్యాటర్లు లిట్టన్ దాస్ (12), ముష్ఫికర్ రహీమ్ (5) ఏ మేరకు పోరాడుతారన్న దానిపై మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది.

గల్ఫ్ జెయింట్స్ కెప్టెన్‌గా క్లాసెన్

- నవంబర్ 21 నుంచి ఐఎల్‌టీ20 ఐదో సీజన్ ప్రారంభం

బలగం టీవీ, స్పోర్ట్స్

దక్షిణాఫ్రికా స్టార్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ ఐఎల్‌టీ20 ఐదో సీజన్‌లో గల్ఫ్ జెయింట్స్ జట్టుకు కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. నవంబర్ 21 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీలో క్లాసెన్ తొలిసారిగా ఆడనున్నాడు. 35 ఏళ్ల క్లాసెన్ ప్రపంచవ్యాప్తంగా 300కు పైగా టీ20 మ్యాచ్‌లు ఆడి 7 వేలకుపైగా పరుగులు సాధించాడు. దక్షిణాఫ్రికా తరఫున 58 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 1,000 పరుగులు చేశాడు.

అదానీ స్పోర్ట్స్‌లైన్ యాజమాన్యంలోని గల్ఫ్ జెయింట్స్ రెండోసారి టైటిల్ సాధించడమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. జట్టు ప్రధాన కోచ్ సైమన్ హెల్మట్‌తో కలిసి పనిచేయడం ఉత్సాహంగా ఉందని క్లాసెన్ తెలిపాడు. ఒత్తిడిలో రాణించే అనుభవం, టీ20 క్రికెట్‌పై అవగాహన క్లాసెన్‌ను జట్టు నాయకత్వానికి బలమైన ఎంపికగా నిలిపాయని కోచ్ హెల్మట్ పేర్కొన్నాడు. డిసెంబర్ 20 వరకు టోర్నీ కొనసాగనుంది.

'డాకు'ని మించి 'కాకా'..



అని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే డాకు ని మ్యాచ్ చేయడం చిన్న విషయం ఏమీ కాదు.తమిళ్ లో జైలర్, విక్రమ్ లాంటి సినిమాల రేంజ్ ఎలివేషన్స్, మ్యూజిక్ ఇందులో వర్క్ అయ్యి న్యూట్రల్ ఆడియెన్స్ లో యూనానిమస్ రెస్పాన్స్ ఆ సినిమాకి దక్కింది. సో ఈ రేంజ్ ని మించి కాకా కి కూడా ఉండాలి. థమన్ పాత స్కోర్ నే మళ్ళీ మిక్స్ చేసాడు. గాడ్ ఫాథర్ లా చిరు కోసం కొత్తగా ఏమన్నా ట్రై చేసి ఉంటే బాగుండు అని చాలా మంది ఫ్యాన్స్ కోరిక కూడా. సో ఈసారి ఏం చేస్తారో చూడాలి.





● థమన్‌తో అంతకు మించి మ్యాజిక్ గ్యారెంటీ అంటున్న దర్శకుడు!

మన సీనియర్ స్టార్ హీరోస్ లో మంచి స్టాండర్డ్స్ ఉన్న చిత్రాల్లో బాలయ్య నుంసీని క్రేజీ ప్రాజెక్ట్ 'డాకు మహారాజ్'కి మంచి మార్క్ పడింది. దర్శకుడు బాబీ తెరకెక్కించిన ఈ సినిమాలో సంగీత దర్శకుడు థమన్ ఇచ్చిన స్కోర్ కి మంచి మార్కులు పడ్డాయి. అంతే కాకుండా థమన్ బెస్ట్ అండ్ క్వాలిటీ వర్క్ లో డాకు కూడా ఒకటి.అయితే దీని స్టాండర్డ్స్ ని మించి మళ్ళీ బాబీ, థమన్ లు చేస్తున్న 'కాకా' ఉండబోతుంది అని ఇద్దరూ చెబుతు న్నారు. మెగాస్టార్ చిరంజీవితో చేస్తున్న కాకా సినిమాకి కూడా థమన్ సంగీతం అందిస్తుండగా లేటెస్ట్ గా దర్శకుడు బాబీ డాకు మహా రాజ్ తర్వాత మళ్ళీ కాకా తో మ్యాజిక్ చేయడం గ్యారెంటీ

CINEMA

విమర్శలను మోటివేషన్‌గా మార్చుకుంటున్నా

దుల్కర్ సల్మాన్!



ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ ఆన్‌లైన్ నెగెటివిటీ, విమర్శలను ఎదుర్కొనే విధానంపై మరియు అవి తన కెరీర్ ఎంపికలపై ఎలా ంటి ప్ర భావం చూపుతున్నా యనే దానిపై తాజాగా స్పందించారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో త నను తీవ్రంగా కుంగదీసిన విమ ర్శలు ఇప్పుడు తనకు సులభంగా ఎదు ర్కొనేలా మారాయని తెలిపారు. తన ఉద్దేశం ఎప్పుడూ మం చి చేయడ మేనని, ఎంత కష్టప డినా కొద్దిపాటి నెగెటివిటీ రావడం సహజమని ఆయన గ్రహించారు. అయితే, ఆ నెగెటివి టీని తానె ప్పుడూ కక్షగా లేదా అసూయగా మార్చుకోలే దని, దాన్ని ఒక మో టివేషన్‌గా తీసు కుని తనని తాను నిరూపించు కోవడానికి ప్రయత్ని స్తానని దుల్కర్ వెల్లడించారు. "కొంత మంది నేను ఒక పాత్ర చేయలే నని భావిస్తే, నేను దాన్ని సవాల్ గా తీసుకుని చేయడానికి ప్రయ త్నిస్తాను. భయపెట్టే లేదా సవాల్ తో కూడిన పాత్రలను ఎంచుకోవ డం వల్ల నటుడిగా నా ఎదుగు దల సాధ్యమైంది. ప్రస్తుతం నాలో ఎలాంటి కసి లేదా పగ లేదు" అని ఆయన భావోద్వేగంగా చెప్పుకొచ్చారు.మరోవైపు, పవన్ సాధినేని దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ నటిస్తున్న తెలుగు డ్రామా చిత్రం 'ఆకాశంలో ఒక తార' నవంబర్ 20, 2026న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదే రోజున ఆయన తండ్రి, మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి నటించిన 'ఓ.ఎం: ఆపరేషన్ మోల్' కూడా విడుదలవుతుండటంతో, బాక్సాఫీస్ వద్ద తండ్రీకొడుకుల సినిమాల మధ్య ఆసక్తికరమైన పోటీ నెలకొంది.

తిరువీర్ కెరీర్‌లో ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్..



'మసూద' సినిమాకు 4 ఏళ్లు!

టాలీవుడ్ వర్ధమాన నటుడు తిరువీర్ కెరీర్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంచలనాత్మక హారర్ థ్రిల్లర్ 'మసూద'.సాయికిరణ్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా స్వధర్మ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రం, ఎలాంటి భారీ అంచనాలు లేకుండా చిన్న సినిమాగా 2022 నవంబర్ 18న విడుదలై బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టించింది. అప్పట్లో ప్రేక్షకులను భయ పెడుతూనే బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించిన ఈ సినిమా, తాజాగా విడుదలై నాలుగేళ్లు పూర్తి చేసుకుంది.ఈ చిత్రంలో కేవలం భయపెట్టే హారర్ సన్నివేశాలు మాత్రమే కాకుండా, ప్రేక్షకులను కట్టిపడేసే బలమైన భావోద్వేగాలు ఉండటంతో అన్ని వర్గాల ప్రేక్షకులు దీనికి కనెక్ట్ అయ్యారు. ఒక సాధారణ అమ్మాయి మసూద ఆత్మ ఆవహించడం, ఆమెను కాపాడుకునేందుకు తల్లి నీలం (సంగీత), పక్కనే ఉండే గోపి (తిరువీర్) చేసే ప్రయత్నాలు సినిమాను ఆద్యంతం ఉత్కంఠగా నడిపించాయి. తిరువీర్ సహజ నటనతో పాటు, కీలక పాత్రలో నటించిన నటి సంగీత అద్భుతమైన పెర్ఫార్మెన్స్ సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. అలాగే కావ్యా కల్యాణ్‌రామ్, శుభలేఖ సుధాకర్ తదితరుల నటన కూడా చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.తక్కువ బడ్జెట్‌తో తెరకెక్కినప్పటికీ, పకడ్బంది స్క్రీన్ ప్లే మరియు నేపథ్య సంగీతంతో ప్రేక్షకులకు సరికొత్త హారర్ అనుభూతిని పంచింది 'మసూద'. ఈ సినిమా ఘన విజయం తిరువీర్ కెరీర్‌ను మలుపు తిప్పడమే కాకుండా, టాలీవుడ్‌లో కొత్త తరహా హారర్-థ్రిల్లర్ జోనర్‌కు సరికొత్త ఊపునిచ్చింది. విడుదలై ఇన్ని ఏళ్లు గడుస్తున్నప్పటికీ, ఈ సినిమా అందించిన భయంతో కూడిన థ్రిల్ మాత్రం ప్రేక్షకుల మదిలో అలాగే నిలిచిపోయింది. మరోవైపు ఈ సినిమా సీక్వెల్ ఎప్పుడా అని ప్రేక్షకుల ఎదురుచూస్తున్నారు.

నటి అనితను నిలువునా ముంచిన సైబర్ కేటుగాళ్లు



హైదరాబాద్‌లోని మాదాపూర్ కావూరి హిల్స్‌లో నివాసముం టున్న ప్రముఖ సినీ నటి గోగినేని అనిత సైబర్ నేరగాళ్ల బారినపడ్డారు. అమెరికాలోని వాషింగ్టన్‌లో ఉంటున్న తన కుమారుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు ఆమె అమెరికా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ ప్రయాణం కోసం బిజినెస్ క్లాస్ విమాన టికెట్లు బుక్ చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో ట్రావెల్ ఏజెంట్ కోసం అన్వేషించారు.ఈ క్రమంలో 'లో ఫ్లై టూర్స్ అండ్ ట్రావెల్స్' పేరుతో ఓ సైబర్ కేటుగాడు ఆమెను సంప్రదించాడు. అమెరికా వెళ్లేందుకు బిజినెస్ క్లాస్ టికెట్ ధర రూ.4,14,180 అవుతుందని నమ్మబలికాడు. టికెట్ బుకింగ్ ప్రక్రియను పూర్తి చేయడానికి డెబిట్ కార్డు వివరాలు తెలపాలని కోరగా, నిజమైన ట్రావెల్ ఏజెంటేనని నమ్మిన నటి అనిత తన డెబిట్ కార్డు వివరాలను అందజే శారు. ఆ తర్వాత బుకింగ్ కోసం అడిగిన ఓటీపీ నంబర్‌ను సైతం ఆమె వెల్లడించారు.కాసేపటికి ఆమె బ్యాంక్ ఖాతా నుంచి 'క్లియర్ ట్రిప్' పేరిట రూ.4,14,180 నగదు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. అయితే, డబ్బులు కట్ అయినప్పటికీ ఎంతకీ టికెట్ బుకింగ్ వివరాలు రాకపోవడంతో అనుమానం వచ్చిన నటి అనిత.. తాను మోసపోయానని గ్రహించారు. వెంటనే ఈ ఘటనపై పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో విమాన టికెట్లు లేదా ఇతర సేవలు బుక్ చేసుకునేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత లేదా బ్యాంకు వివరాలను ఎవరికీ తెలపవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఆయనతో పనిచేయడం ఓ పీడకల..!

దియా మీర్జా సంచలన వ్యాఖ్యలు



బాలీవుడ్‌లో వివాదాలకు దూరంగా ఉంటూ తన పనేదో తాను చేసుకుపోతుంటుంది కథానాయిక దియా మీర్జా. అయితే ఆమె సోషల్‌మీడియా వేదికగా నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీపై చేసిన తాజా వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. బుధవారం తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో నవాజుద్దీన్ సిద్ధిఖీని ట్యాగ్ చేస్తూ ఓ పోస్ట్ పెట్టింది దియా మీర్జా. 'ఆయనతో కలిసి పనిచేయడం పీడకల లాంటిది. ఏమాత్రం మాట్లాడే విధానం తెలియదు. ఇక ఆటిట్యూడ్ గురించి చెప్పాల్సిన అవసరం లేదు. ఏమాత్రం సంస్కారం లేని వ్యక్తిత్వం' అంటూ దియా మీర్జా తన పోస్ట్‌లో పేర్కొన్నది.కొన్ని గంటల వ్యవధిలోనే ఈ పోస్ట్ వైరల్‌గా మారింది. దీనిపై నవాజుద్దీన్ సిద్ధిఖీ కూడా ఘాటుగా స్పందించారు. ఆటిట్యూడ్ గురించి మాట్లాడటం చాలా సులభమని, తన పనిలో తప్పులుంటే వెతికి చూపించాలని కౌంటర్ ఇచ్చారు. ఆయన సమాధానం కూడా సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. అయితే వీరిద్దరి వ్యవహారంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం వారిద్దరూ కలిసి నటిస్తున్న 'డాక్టర్ హసన్' అనే వెబ్‌సిరీస్ ప్రచారంలో భాగంగా కావాలనే ఈ వివాదాన్ని సృష్టించారని అంటున్నారు. దియా మీర్జా వివాదాల జోలికి వెళ్లదని, ఇదంతా ప్రమోషన్‌లో భాగమేనని మెజారిటీ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. అమెరికాలో పాపులర్ అయిన మెడికల్ డ్రామా 'హౌస్ ఎం.డి' ఆధారంగా 'డాక్టర్ హసన్' వెబ్‌సిరీస్‌ను తెరకెక్కించారు.

మరో బిగ్ ఛాన్స్ పట్టేసిన 'ఆకాశంలో ఒక తార' బ్యూటీ!



తన మొదటి సినిమాతోనే అందరి దృష్టి ఆకర్షించే హీరోయిన్స్ చాలా తక్కువమంది ఉంటారు. అందులోని మన తెలుగు హీరోయిన్స్ అయితే ఇంకా అరుదు. అలా లేటెస్ట్ గా ఓ తెలుగు బ్యూటీ తన మొదటి సినిమా విడుదల కాక ముందే వరుస ఆఫర్స్ అందుకుంటుంది. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన ఎమోషనల్ చిత్రమే 'ఆకాశంలో ఒక తార'.దర్శకుడు పవన్ సాధినేని తెరకెక్కించిన ఈ సినిమాలో యువ హీరోయిన్ సాత్విక వీరవల్లి తెలుగు సినిమాకి పరిచయం కాబోతుంది. అయితే ఈ సినిమా విడుదల కాకుండానే నిర్మాత అల్లు అరవింద్ తన నెక్ట్స్ సినిమాలో అవకాశం ఇచ్చినట్టు తెలుస్తుంది.అది కూడా యంగ్ హీరో అక్కినేని నాగ చైతన్య కాంబినేషన్ లో చేయనున్న బెంచ్ మార్క్ సినిమాలో ఆమె అవకాశం దక్కించుకోవడం విశేషం. దీనితో సాత్విక తన ఖాతాలో బిగ్ ఛాన్స్ ని పట్టేసింది అని చెప్పవచ్చు. ఇక ఆకాశంలో ఒక తార ఈ నవంబర్ 20న గ్రాండ్‌గా విడుదల కాబోతుంది.

గ్రీస్‌లో రజనీకాంత్ కుటుంబం సందడి..

మనవళ్లతో కలిసి ఎంజాయ్ చేస్తున్న సూపర్ స్టార్!



కోలీవుడ్ సూపర్ స్టార్ రజనీ కాంత్ సినిమాలతో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, కుటుంబం తో సమయం గడపడానికి ఎప్పుడూ ప్రా ధాన్యత ఇస్తారు. తాజాగా రజనీకాంత్ తన కుటుంబ సభ్యులతో కలిసి గ్రీస్ దేశంలో సరదాగా గడుపు తున్న అద్భుతమైన ఫోటో లు ప్రస్తుతం సోషల్ మీడి యాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.తలైవా చిన్న కుమార్తె, ప్రముఖ నిర్మాత సౌందర్య రజనీకాంత్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా వేదికగా ఈ ఫ్యామిలీ వెకేషన్ పిక్స్‌ను అభిమానులతో పంచుకున్నారు. గ్రీస్ రాజధాని ఏథె న్స్ నగర వీధుల్లో సూపర్ స్టార్ రజనీకాంత్ తన సతీమణి లతా రజనీకాంత్, కుమార్తెలు సౌంద ర్య, ఐశ్వర్య, మనవళ్లతో కలిసి ఉత్సాహంగా నడుస్తూ ఎంజాయ్ చేస్తున్న దృశ్యాలు ఈ ఫోటోల్లో కనువిందు చేస్తున్నాయి. "ఏథెన్స్‌లో మేము ఎన్నో అద్భుతమైన జ్ఞాపకా లను సృష్టించుకున్నాం! ఈ అందమైన ఫ్యామిలీ గెట్‌అవేలోని ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తున్నాం" అం టూ సౌందర్య క్యాప్షన్ జోడించారు. క్యాజువల్ లుక్‌లో ఎంతో రిలాక్స్‌డ్‌గా, చిరునవ్వుతో కనిపిస్తున్న తలైవాను చూసి అభిమానులు మురిసిపోతున్నారు. ఇటీవల గ్రీస్ వేదికగా జరిగిన సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ వివాహ వేడుకల్లో పాల్గొన్న రజనీకాంత్ కుటుంబం, ఆ తర్వాత ఇలా తీరిక సమయం చేసుకుని ఏథెన్స్ అందాలను ఆస్వాదిస్తూ విలువైన జ్ఞాపకాలను సొంతం చేసుకుంటోంది.

స్లో అవుతున్న 'రామాయణ'..



టాప్ గ్రాసర్ గా నిలిచేనా?

బాలీవుడ్ సినిమా అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన లేటెస్ట్ భారీ చిత్రమే 'రామాయణ'. బాలీవుడ్ సూపర్ స్టార్ రణబీర్ కపూర్, సాయి పల్లవి అలాగే కన్నడ రాకింగ్ స్టార్ యష్ ల కలయికలో దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కించిన ఈ భారీ విజువల్ ట్రీట్ రెండో వారాంతం వరకు సాలిడ్ వసూళ్లు రాబట్టి అదరగొట్టింది.ఆల్రెడీ 1500 కోట్ల మార్క్ దగ్గరకి ప్రపంచ వ్యాప్తంగా చేరుకుంటున్న ఈ సినిమా ప్రస్తుతం నెమ్మదించినట్టు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీనితో ఇండియా వైడ్ గా టాప్ గ్రాసర్ గా నిలిచే ఛాన్స్ ఉందా అనేది ఆసక్తిగా మారింది. పుష్ప 2, ధురంధర్ 2 లని దాటి ఈ సినిమా ట్రెండ్ కంటిన్యూ చేస్తుందా లేదా అనేది వేచి చూడాలి. ఇక ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్ తదితరులు నటించగా ఏ ఆర్ రెహమాన్, హన్స్ జిమ్మర్ లు సంగీతం అందించారు. అలాగే యష్, నమిత మల్హోత్రా నిర్మాణం వహించారు.